


ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## స్టేట్ విజన్

STATE VISION

మంగళవారం 16-06-2026 పేజీలు : 16


## దాహంతో నిజాంపేట్... నిద్రలో వాటర్‌బోర్డు!

- నిజాంపేట్‌కు నీళ్లు కరువు... అధికారులకు పట్టదా?
- రోజురోజుకూ ముదురుతున్న తాగునీటి సంక్షోభం
- ఐదు లక్షల జనాభాకు వారానికి ఒక్కసారే తాగునీటి సరఫరా
- నీరు లేకున్నా బిల్లుల వసూళ్లు.. ట్యాంకర్ల వ్యాపారంపై అనుమానాలు
- 14 ఎంజీడీ కేటాయింపు, కోటి లీటర్ల అదనపు నీరు కోరిన జేపీసీ

16 పేజీలో...

# నకిలీ పత్తి విత్తనాల అంతరాష్ట్ర ముఠా గుట్టురట్టు




- ప్రధాన నిందితుడి అరెస్ట్ రిమాండ్, 9 మంది పై కేసు నమోదు
- రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం
- 792 ప్యాకెట్ల పింక్ బాండ్ పత్తి విత్తనాల ప్యాకెట్లు మరియు 9.5 లక్షల విలువ చేసే ఎక్స్పైరీ అయిన విత్తనాలు మందులు స్వాధీనం
- మొత్తం స్వాధీనం చేసుకున్న విత్తనాల విలువ దాదాపు రూ 20 లక్షలు.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

14 పేజీలో...

## చర్ల లో ఘనంగా భట్టి విక్రమార్క 65వ జన్మదిన వేడుకలు




- చర్ల మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఫోన్ ద్వారా ఎంపీ బలరాం నాయక్ వెల్లడి
- ప్రజా సేవలో బట్టిది ప్రత్యేకమైన మార్క్
- మండల కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు, వేరువేరు కేక్ కటింగ్ లు

15 పేజీలో...

## బెల్లంపల్లిలో టీఆర్ఎస్ జెండా పండుగ పట్టణంలో భారీ ర్యాలీ



6 పేజీలో...

## సి.డి.ఎ సంస్థ ద్వారా 2.40 లక్షలతో మూడు ఉచిత చేతి పంపుల ఏర్పాటు

-సిడిఎ కార్యదర్శి, ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవ ఎనోష్ కుమార్

16 పేజీలో...

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట

- మండల విద్యాధికారి గజ్జల కనకరాజు
- యంగ్ ఇండియా కిట్లు, నూతన యూనిఫామ్స్ పంపిణీ
- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి

2 పేజీలో...



## చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కుత్బుల్లాపూర్, జూన్ 15: (విజన్ ఆంధ్ర); విద్యుత్ లైన్లకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ట్రిమ్మింగ్) పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూన్ 16న (మంగళవారం) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు టీఎస్ఎస్పీడీసీఎల్ కుత్బుల్లాపూర్ ఆపరేషన్ విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) తెలిపారు. ఈ మేరకు

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సుభాష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పద్మానగర్ ఫీడర్ కింద ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది.

ప్రభావిత ప్రాంతాలు: పద్మానగర్ ఫేజ్--2, పద్మానగర్ రింగ్ రోడ్, అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ సూర్యానగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

ప్రభావిత ప్రాంతాలు: సూర్యానగర్, రామ్‌రెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్, పద్మ నగర్ ఫేజ్--1, బాల్‌రెడ్డి నగర్, బాపునగర్, శ్రీరామ్‌నగర్, విద్యుత్ వ్యవస్థ నిర్వహణ, భద్రతా చర్యల్లో భాగంగా చేపడుతున్న ఈ పనులకు స్థానిక ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం

**- సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య**

మాడుగుల, జూన్ 15, (విజన్ ఆంధ్ర) : గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని గ్రామ సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య అన్నారు. గ్రామంలోని సోమవారం మిషన్ భగీరథ పైపులైను మరమ్మతులు చేపట్టి ఎస్సీ కాలనీ వాసులకు మంచినీటిని అందించారు. సందర్భంగా సర్పంచ్ జయమ్మ యాదయ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ కార్మికుల చేత పరిశుభ్రత చేస్తున్నానని చెప్పారు. గ్రామంలోని డ్రైనేజ్ వ్యవస్థను చేస్తానని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రామస్తులను కోరారు. పిల్లల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. దేశంలో ఉన్న ప్రముఖులు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నవారని చెప్పారు. ప్రతి వీధికి వీధిలైట్లు వేయించామన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజలంతా సహకరించాలని అన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది

## సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్

జన్నారం, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠ శాలలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని పోనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ అన్నారు. సోమవారం రోజున జన్నారం మండలంలోని పోన కల్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభం సందర్భంగా పాఠశాలలో ఏ ర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో స్థా నిక సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ పాల్గొని విద్యా ర్థులకు నూతన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపరు స్తుందని నాణ్యమైన విద్య, మధ్యాహ్నం భోజనం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు ఇలా ఎన్నో వసతు లను ప్రభుత్వం ఉ చితంగానే అందిస్తుందని తెలి పారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పాలని కోరారు. అనంతరం పాఠశాల లో చేరిన పలువురు విద్యార్థులకు అడ్మిషన్ ప త్రాలు అందజేశారు.



ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షులు అజ్మీరా నందు నాయక్, పట్టణ అధ్య క్షులు మంద రాజేష్, పాఠశాల చైర్పర్సన్ రేణుక, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్.విజయ్ కుమా ర్, వార్డు సభ్యుడు మర్రిపెల్లి అంజన్న, ప్రవీణ్, ఉపా ధ్యాయులు రాజేశం, శ్రీకాంత్, వనిత, సుజాత తది తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట

**- మండల విద్యాధికారి గజ్జల కనకరాజు**

**- యంగ్ ఇండియా కిట్లు, నూతన యూనిఫామ్స్ పంపిణీ**

**- పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి**

దౌల్తాబాద్,జూన్ 15 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు "యంగ్ ఇండియా" కిట్లతో పాటు ఆకర్షణీయమైన నూతన రంగులతో కూడిన యూనిఫామ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అలాగే, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.



మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వాటిని సకాలంలో పంపిణీ చేసినట్లు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యా సామగ్రి అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధ్యాయుల పనితీరు మెరుగుదల, డిజిటల్ విద్య, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నాయని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని సూచించారు.

ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు ఆకాంక్షించారు.

# రేచినిలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

**- 40 బైక్‌ల తనిఖీ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు**

**- బెల్ట్‌షాపులపై దాడులు..**

**- 30 మద్యం సీసాల స్వాధీనం**

బెల్లంపల్లి జూన్ 15 విజన్ ఆంధ్ర : ప్రజల భాగస్వామ్యంతో నేరాలను అరికట్టడమే లక్ష్యంగా తాండూర్ పోలీసులు రేచిని గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ దేవయ్య, ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు

గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

మొత్తం 40 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనలు ఉ ల్లంఘించిన వారిపై జరిమానాలు విధించారు. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా సీఐ దేవయ్య మాట్లాడుతూ

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులను తెరవకూడదని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. ఫేక్ కాల్స్, ఫిషింగ్ సందేశాలు, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్--100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని, యువత వాటికి దూరంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ధృవీకరించిన విక్రేతల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు, వరకట్నం వంటి సామాజిక దురాచారాలను అరికట్టడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలతో పాటు ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేరాల నియంత్రణకు దోహదపడుతుందని వివరించారు. మానసిక ఒత్తిడి ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడాలని, అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవాలని సూచిస్తూ, "సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు" అని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ ప్రసాద్, భీమిని ఎస్ఐ కోటేశ్వర్‌తో పాటు సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## సర్పంచ్ చొరవతో రోడ్డుకు మరమ్మతులు

బోథ్, జూన్ 15. (విజన్ ఆంధ్ర) : బోథ్ మండలం నక్కలవాడ సర్పంచ్ అడప నవీన్ కుమార్ చొరవతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. నక్కలవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్, కొత్తపల్లి, రేండ్లపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు కొనసాగించాలంటే ఆయా పల్లె వాసులు జంకుతున్నారు. వర్ష కాలంలో ఈ రోడ్డు మరింత నరకప్రాయంగా మారుతుంది. దీంతో ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించే ప్రజల ఇబ్బందులను గుర్తించి ముందస్తు జాగ్రత్తగా రోడ్డుపై సర్పంచ్ అడప నవీన్ కుమార్ సోమవారం మొరం వేయించడం జరిగింది. తమ కష్టాలను గుర్తించి సమస్యను తీర్చిన సర్పంచ్ కు ఆయా పల్లె ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అడప నవీన్ కుమార్, ఉపసర్పంచ్ లక్ష్మీబాయి, నాగోరావు, వార్డ్ మెంబర్ కోసేరావు, పల్లె ప్రజలు పాల్గొన్నారు.

## భూపాలపల్లి కేటీకే ఐదవ గనిలో షాట్ ఫైరింగ్ ప్రమాదం

**-డిటోనేటర్ పేలి చేతి వేళ్ళు నుజ్జు నుజ్జు అయి ప్రాణాలతో బయటపడిన కార్మికుడు**



భూపాలపల్లి జిల్లా జూన్ 15 (విజన్ ఆంధ్ర క్రైం ) కేటీకే ఐదవ గనిలో ఫ్రీ షిఫ్ట్ లో శ్రీరాముల ప్రదీప్ (35)అనే కార్మికుడు విధులు నిర్వహిస్తున్న సమయంలో లో డిటోనేటర్ బ్లాస్ట్ అయి డిటోనేటర్ పెలడంతో నుజ్జు నుజ్జు అయిన చెయ్యి వేళ్ళు. దీనికి కారణం ఎక్షప్లోజీవ్ బ్లాస్టింగ్ కొత్త సిస్టమ్ రావడంతో ఇంద్ర అనే కంపెనీ కి చెందిన నాణ్యత లోపం గల కంపెనీకి చెందిన ఎక్సప్లోసివ్ బ్లాస్టింగ్ వాడడం వలనే ఈ ప్రమాదం జరిగింది అని కార్మికులు చర్చించుకుంటున్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగగకోపోవడం తో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

## కలెక్టర్ సారు నాకు పింఛను రాక రెండు ఏండ్లు అయితాంది సారు...జర ఇప్పించండి సారు



భూపాలపల్లి జిల్లా జూన్ 15(విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో లో కలెక్టర్ కార్యాలయం లో సోమవారం ప్రజావాణి లో దరఖాస్తు ఇవ్వడానికి వచ్చిన నడవలేని ఈ వికలాంగురాలి పేరు వడ్లురి శ్యామల గ్రామం పిడిసిల్ల మొగుళ్లపల్లి మండలం ఈమెకు పింఛను రాక రెండు సంవత్సరాలు అవుతుంది సదరం సెర్టిఫికెట్ రెన్యూవల్ కోసం వచ్చింది. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలిసిపోయింది. కలెక్టర్ సారు నాకు పింఛన్ ఇప్పించేటట్టు చేయండి సారు అని వేడుకుంటుంది.

# పదకొండు దాటినా పత్తా లేని అధికారులు

**- ప్రజలకు నిరీక్షణ తప్పని పరిస్థితి**

దౌల్తాబాద్, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సకాలంలో సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేయాల్సి ఉండగా, దౌల్తాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. కార్యాలయ విధులు ఉదయం ప్రారంభం కావాల్సి ఉండగా, సోమవారం ఉదయం 11 గంటలు దాటినా పలువురు రెవెన్యూ సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. భూముల సంబంధిత సమస్యలు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, పహాణీలు, ఇతర రెవెన్యూ సేవల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయం వద్ద గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచే కార్యాలయానికి చేరుకున్న ప్రజలు సిబ్బంది రాక కోసం వేచి చూడాల్సి రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో నాయబ్ తహశీల్దార్, ముగ్గురు జీపీఓలు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధుల్లో కనిపించగా, మిగతా సిబ్బంది సమయానికి హాజరు కాలేదని తెలిసింది. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని పదేపదే ఆదేశాలు



జారీ చేస్తున్నప్పటికీ, కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ఆ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కార్యాలయ సమయాలను పాటించకపోవడం వల్ల ప్రభుత్వ శాఖలపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాల్లో సిబ్బంది సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# మర్పల్లి ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల సందడి

**- నాణ్యమైన విద్యతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు**

**- త్వరలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మారనున్న ఆదర్శ పాఠశాల**

**- ప్రిన్సిపల్ జి ప్రమీల**

మర్పల్లి, జూన్ 15: వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ప్రమీల సోమవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో పాఠశాల అత్యాధునిక సౌకర్యాలతో ముందుకు సాగుతోందన్నారు. ఇంగ్లీష్ మీడియం బోధన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, డిజిటల్ తరగతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి క్రీడలు, కరాటే శిక్షణ, స్కౌట్స్ అండ్ గైడ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రంథాలయ సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈ స్కాలర్‌షిప్‌లకు ప్రత్యేక శిక్షణ, కంప్యూటర్ ల్యాబ్, ప్రయోగశాలలు, వృత్తి నైపుణ్యాభివృద్ధి కోర్సులు, 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు.



మర్పల్లి ఆదర్శ పాఠశాల/ కళాశాల త్వరలోనే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా రూపాంతరం చెందనున్నట్లు ప్రిన్సిపల్ ప్రమీల తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆదర్శ పాఠశాల వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# బడి పిల్లల హాజరుపై... అమావాస్య ప్రభావం

బోథ్, జూన్ 15. (విజన్ ఆంధ్ర) : వేసవి సెలవుల అనంతరం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. కాగా పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజే అమావాస్య రావడంతో సెంటిమెంట్ కారణంగా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపలేరు. దీంతో పిల్లలు లేక తరగతి గదులు వెలవెలబోయాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ ప్రభావం కనిపించింది. కొన్ని గ్రామాల్లో కేవలం 10 నుండి 15 శాతం లోపే హాజరు నమోదైందని విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. అమావాస్య రోజు పిల్లలను పాఠశాలకు పంపడం మంచిది కాదనే నమ్మకంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికే పరిమితం చేశారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడం ఆది కూడా ఈ సీజన్ లో అతి పెద్ద వర్షం ఆదివారమే కురవడంతో చాలా మంది రైతులు సోమవారం తమ తమ పంట పొలాల్లో విత్తనాలను నాటారు. దీంతో చాలా మట్టుకు రైతులు తమ పిల్లలను విత్తనాలను నాటడానికి పంట పొలాల్లోకి తీసుకెళ్లారు. అమావాస్యకు తోడు వ్యవసాయ పనులు కూడా పిల్లలు బడికి హాజరు కాకపోవడానికి మరో కారణం అయ్యింది. వేసవి సెలవుల తర్వాత బడులు తెరుచుకోవడంతో ప్రభుత్వం పాఠశాలలను అందంగా ముస్తాబు చేసినప్పటికీ అమావాస్య తో పాటు కొన్ని చోట్ల విత్తనాలు నాటడం కూడా విద్యార్థుల హాజరుకు అడ్డంకిగా మారాయి.



లిరెండు రోజుల్లో అసలైన సందడి ప్రారంభంలి

తొలి రోజు అమావాస్య సెంటిమెంట్ తో క్లాస్ రూమ్ లు ఖాళీగా కనిపించాయి. రెండో రోజు మంగళవారం కూడా అంతంత మాత్రంగానే పిల్లలు బడికి హాజరయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బుధవారం నుండి పాఠశాలలకు పూర్తి స్థాయిలో విద్యార్థులు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా నేటి సాంకేతిక యుగంలో కూడా పాఠశాలల హాజరుపై అమావాస్య సెంటిమెంట్ ఈ స్థాయిలో ప్రభావం చూపడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# కొడంగల్ కు బాలికల జూనియర్ కళాశాల మంజూరు..

## - సీఎం రేవంత్ రెడ్డి పై స్థానికుల హర్షం

కొడంగల్,15జూన్ (విజన్ ఆంధ్ర ):ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గ కేంద్రం కొడంగల్ కు బాలికల జూనియర్ కళాశాల మంజురు కావడంతో స్థానిక ప్రజలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వెనక బడిన మారుమూల ప్రాంతమైన కొడంగల్ నియోజకవర్గ కేంద్రం కొడంగల్ పట్టణంలో బాలికల జూనియర్ కళాశాల మంజూరీ చేయడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థినిలా ఉన్నత విద్యాభ్యాసానికి మరియు మహిళా సాధికారాతకు ఈ నిర్ణయం ఎంతోగానో దోహద పాడుతుందని పట్టణం ప్రజలు పేర్కొన్నారు. ఈ విధ్య సంవత్సరం నుండే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభం కావడంతో ఉపాధ్యాయ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నేటి నుండి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఇసీ, హెచ్ఇసీ, ఎం ఎల్ టీ, ఎంపీ హెచ్ డబ్ల్యూ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభం అవుతున్నందున అర్హులైన విద్యార్థినిలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయ సంఘం పిఆర్టీయు కొడంగల్ శాఖ అధ్యక్షులు అబ్దుల్ హాక్, ప్రధాన కార్యదర్శి దినేష్ సింగ్ సూచించారు. ఈ సందర్భంగా బాలికల కళాశాల మంజూరు కొరకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ,మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విధ్యార్థుల నమోదు పెంచాలి

## - మండల విద్యాధికారి శంకర్.
## - పాల్గొన్న సర్పంచ్ తులసీ సత్యనారాయణ



సదాశివపేట :విజన్ ఆంధ్ర :వేసవి సెలవుల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా 2026-2027 విద్యా సంవత్సరం నకు సోమవారం నుండి పాఠశాలలు తెరుచుకున్నాయి. సదాశివపేట మండలంలోని నిజాంపూర్ కాలనీ పాఠశాలను కొబ్బరి మరియు మామిడి తోరణాలతో అందంగా అలకరించారు.ఉపాధ్యాయులు గులాబీ పూలతో మరియు మిఠాయి లతో విద్యార్థులకు స్వాగతం పలికారు.పాఠశాల తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు సర్పంచ్ జోరీగల తులసి సత్యనారాయణ మరియు ముఖ్య అతిధిగా విచ్చేసిన మండల విద్యాధికారి శంకర్ చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు,వర్క్ పుస్తకాలు మరియు నోట్ పుస్తకాలను అందించారు.విద్యార్థులకు అక్షయ పాత్ర భోజనాన్ని వడ్డించారు. అనంతరం సర్పంచ్ మరియు మండల విద్యాధికారి శంకర్ కలసి పాఠశాల తరగతి గదులు,మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం,పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు.అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం తొలిరోజునే పాఠశాలకు మరియు విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులు కల్పించి,ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణాన్ని కల్పించినందుకు మరియు గత సంవత్సరం లో పాఠశాలను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచినందుకు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణను, అన్ని విషయాలలో సహాయ సహకారాలు అందించిన మండల విద్యాధికారి శంకర్ ను,మరియు ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు కూడా బడి బాటలో పాల్గొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేసి ప్రభుత్వం విద్యార్థులకు కల్పించే వసతులను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల భోదనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసి సత్యనారాయణ, మండల విద్యాధికారి శంకర్,ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,ఉపాధ్యాయులు నవనీత,హెల్పర్ సుగుణమ్మ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఇంటర్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు

# దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ తరగతులకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి స్వేత సోమవారం తెలిపారు. తెలుగు, ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణత కలిగిన వారికి అవకాశం ఉండగా, బి.ఎడ్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు చేవెళ్లలోని కేజీబీవీ విద్యాలయాన్ని లేదా ప్రత్యేకాధికారి స్వేతను 9100439368 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

## - కొత్త తండా(పి)లో రైతులకు సూచనలు చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు లాల్చంద్.




టేకులపల్లి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : టేకులపల్లి మండలంలోని కొత్త తండా(పి) గ్రామంలో ఇల్లందు వ్యవసాయ సహాయ సంచాలకులు లాల్చంద్ రైతులతో సమావేశమై ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పంటల సాగుపై పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పెసర, కంది, కూరగాయలు, నువ్వులు, పామ్ ఆయిల్ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నందున, కనీసం 60 నుంచి 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే వరకు పొడి దుక్కిలో విత్తనాలు వేయవద్దని రైతులకు సూచించారు.వరి సాగు చేపట్టే రైతులు ప్రభుత్వ సూచించిన బీపీటీ-5204 (సాంబా మసూరి), హెచ్ఎంటీ, తెలంగాణ సోనా, కెఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, జేజీఎల్-1798, డబ్ల్యూజీఎల్-962 వంటి రకాలనే సాగు చేయాలని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేసి, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులకు సూచనలు చేశారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని కోరారు.

# కలెక్టర్‌కు సేవాలాల్ సేన వినతి

## - ఫెర్టిలైజర్ దందాలపై ఉక్కుపాదం మోపాలి గిరిజన యువతను బలిపశువులుగా మారుస్తున్న అక్రమ నెట్‌వర్క్‌లు..
## - బాధ్యులపై కఠిన చర్యలు కోరిన సేవాలాల్ సేన
## - డైరెక్ట్ సేలింగ్ కంపెనీల పేరుతో గిరిజన నిరుద్యోగుల మోసం..
## - బినామీ ఫెర్టిలైజర్ దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్



టేకులపల్లి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా సాగుతున్న బినామీ ఫెర్టిలైజర్ దందాలు, డైరెక్ట్ సేలింగ్ కంపెనీల పేరిట గిరిజన నిరుద్యోగ యువతను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ మాట్లాడుతూ, కొన్ని కంపెనీలు డైరెక్ట్ సేలింగ్ పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లోకి ప్రవేశించి అమాయక గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు అధిక ఆదాయాల ఆశ చూపుతూ మోసాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈ అక్రమ నెట్‌వర్క్‌ల కారణంగా అనేక మంది యువకులు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలు, ఐటీడీఏ నిబంధనలను ఉల్లంఘిస్తూ గిరిజనుల పేర్లపై గిరిజనేతరులు బినామీ ఫెర్టిలైజర్ లైసెన్సులు పొందుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు యజమానులు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో ఉంటూ ఇక్కడ బినామీల ద్వారా వ్యాపారాలు నిర్వహిస్తూ రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

కొన్ని ఫెర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయంపై కనీస అవగాహన లేని సిబ్బందిని నియమించి, కాలం చెల్లిన పురుగుమందులు, నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న డైరెక్ట్ సేలింగ్ కంపెనీల లైసెన్సులు, వాటి వెనుక ఉన్న నిర్వాహకులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అలాగే వ్యవసాయశాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఫెర్టిలైజర్ దుకాణాలపై తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.గిరిజనుల పేర్లతో గిరిజనేతరులు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు తేలితే సంబంధిత దుకాణాలను సీజ్ చేసి, బాధ్యులపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేయాలని కోరారు. రైతులకు విక్రయించే ప్రతి ఎరువు, పురుగుమందుకు తప్పనిసరిగా కంప్యూటర్ బిల్లు జారీ చేసే విధంగా నిబంధనలు కఠినతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు నాయక్, నరేష్ నాయక్, పాల్వంచ మండల అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయక్, లాలూ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మౌళిక వసతుల కల్పనే ధ్యేయం

## - సర్పంచ్ సడవలి వెల్లడి

కాటారం డివిజన్ ప్రతినిధి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ప్రజలకు మౌళిక వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని కాటారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పంతకాని సడవలి అన్నారు. కాటారం గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కాటారం గ్రామపంచాయతీ 10 వార్డు లోని అయ్యప్ప టెంపుల్ వాడలో సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ పంతకాని సడవలి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మురుగునీటి కాలువలు లేక నీరు అస్తవ్యస్తంగా రోడ్డుమీదికి రావడంతో అయ్యప్ప టెంపుల్ కి వెళ్లేటువంటి భక్తుల యొక్క ఆధ్యాత్మిక భావన , భక్తుల మనోభావాలకు భంగం కలగకుండా సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉప సర్పంచ్ కొండ గొర్ల బానయ్య, వార్డు మెంబర్లు కొండపర్తి జ్యోతి రవి, కొండ రాజమల్లు, జాడి మల్లమ్మ, పసుల మొగిలి, మానేం రాజబాబు, జాడి రాజేష్, అక్కపాక మల్లయ్య, కొండ రాము, గ్రామ పెద్దలు మొగిలి సమ్మయ్య, పనకంటి ప్రకాష్, పసుల రామచంద్రం, కొండ గొర్ల వెంకటస్వామి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం బీజేపీ పోరు బాట...

## తహసీల్దార్ కు వినతిపత్రం...



బోధన్,జూన్15 (విజన్ ఆంధ్ర) :: రైతులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చూడాలని, సాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు పంట నష్టపోయిన వారికి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బోధన్ తహసీల్దార్ విఠల్ కు సోమవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి బీజేపీ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అన్నదాతల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడ్లూరి శ్రీనివాస్, శ్రీధర్, సిర్ప సుదర్శన్, గోపికిషన్, బాలరాజు, గంగాధర్, వినోద్ తదితరులు ఉన్నారు.

# సీసీ కెమెరాల కోసం గ్రామానికి టీ.వీ అందజేసిన దేవి రవీందర్..

కుకునూరుపల్లి, జూన్ 15,విజన్ ఆంధ్ర : కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో సోమవారం శాంతిభద్రతలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్వహించిన కార్యక్రమంలో గ్రామశీ లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని తొగుట సీఐ లతీఫ్ కోరగా సీసీ కెమెరాల పర్యవేక్షణకు ఉపయోగపడే టీ.వీ ని మాజీ వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్ దేవి రవీందర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతల శిల్ప నర్సింలు, పాలక వర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# పరిశుభ్రత,నాణ్యమైన విద్య ప్రకటనలకే పరిమితమా?

## - విద్యార్థులకు అందని మిషన్ భగీరథ నీరు...

## - అధికారుల పర్యవేక్షణ లోపం....



కారేపల్లి,జూన్ 15 (విజన్ ఆంధ్ర) : పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత విద్యార్థుల భవిష్యత్తును,విద్యా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. సరైన తరగతి గదులు,త్రాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే మౌలిక సదుపాయాల లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. విద్యార్థులు వాడే మరుగుదొడ్లలో నీరు అందకపోవడం,మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడంవల్ల చిన్నారుల అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. పాఠశాలలకు మిషన్ భగీరథ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పైపులైన్ కనెక్షన్ సమస్యల కారణంగా వాటర్ ట్యాంకులకు నీరు చేరడం లేదు.వాటర్ ట్యాంక్ సైతం పాకురు పట్టి అపరిశుభ్రంగా కనిపించడం ఇందుకు నిదర్శనం.99 రోజుల ప్రణాళికలో కనీసం విద్యార్థులకు మౌలిక వసతులు సైతం కల్పించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి మచ్చు తునకగా కనిపిస్తుంది.ఇటీవల ప్రజా పాలన ప్రణాళికలో కార్యచరణ నిర్వహించినా ఫలితం శూన్యంగా కనిపిస్తుంది.ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య,పరిశుభ్రత ప్రకటనలకే పరిమితం కాకూడదని,క్షేత్రస్థాయిలో వాటిని అమలు పరచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు శాశ్వత పరిష్కారం చూపిస్తే విద్యార్థులకు పాఠశాలలు సౌకర్యవంతంగా ఉంటాయనిడంలో అతిశయోక్తి కాదు.

# బెల్లంపల్లిలో టీఆర్ఎస్ జెండా పండుగ

# పట్టణంలో భారీ ర్యాలీ

## - పాంచజన్యం పేరుతో కొత్త కార్యాచరణ ప్రకటించిన టీఆర్ఎస్ టి ఆర్ ఎస్ అధినేత

## - కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత ఘాటు విమర్శలు



బెల్లంపల్లి జూన్ 15 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి పట్టణంలో టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) ఆధ్వర్యంలో జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బెల్లంపల్లి చేరుకున్న సందర్భంగా టీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు హాజరయ్యారు.

నినాదాలతో బారి ర్యాలీ నిర్వహించారు

పట్టణంలో బజార్ ఏరియాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కల్వకుంట్ల కవిత

అనంతరం స్థానిక తిలక్ స్టేడియం ముందు టీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం టిఆర్ఎస్ అధి నేత్రి కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేరని ఆరోపిస్తూ, కోర్టు సమీపంలో రోడ్డు పూర్తిగా అధ్వాన్న స్థితిలో ఉందని, స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని, పెన్షన్లు పెంచలేదని, రైతుల వడ్లు కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే టీఆర్ఎస్ భవిష్యత్ కార్యాచరణను పాంచజన్యం పేరుతో ప్రకటించారు. ఇందులో ఉచిత విద్య, స్కూల్ ఫీజుల తగ్గింపు, యువతకు రూ. 2 లక్షల నుంచి రూ. 20 కోట్ల వరకు రుణాలు, ఉద్యోగ అవకాశాల కల్పన, రైతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు, ఉచిత వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేసారు. . ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్ధన్, హెచ్ ఎం ఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిద్ధం శెట్టి సాజన్, రాష్ట్ర జిల్లా నాయకులు మౌనిక్, మహిళ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారును కలిసిన రెడ్డికా సంఘం నాయకులు...

బోధన్, జూన్ 15(విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నెంబర్ 10 ద్వారా 'రెడ్డికా' కులానికి అధికారికంగా డీఎన్టీ (డి. ఎన్. టి.) గుర్తింపు దక్కడం పట్ల నిజామాబాద్ జిల్లా రెడ్డికా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. దశాబ్దాల కలను సాకారం చేస్తూ, తమ కుల అస్తిత్వాన్ని నిలబెట్టిన ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డికా సంఘం నాయకులు గుమ్ముల అశోక్ రెడ్డి (బోధన్), పాడ్డే రాజు (రెంజల్), కొట్టాల ప్రవీణ్ కుమార్ (నవీపేట్), సూర అబ్బారెడ్డి (మోస్రా), పిట్ల సాయన్న (జానకంపేట్), పట్నం రవి (బోధన్), పంతులు అరుణ్ (నిజామాబాద్), ఎర్గం ప్రకాష్ (నిజామాబాద్) తదితరులు ఉన్నారు.



# ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు....

నేలకొండపల్లి జూన్ 15 (విజన్ ఆంధ్ర ): ...ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల కేంద్రంలో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారి జన్మదిన వేడుకలు రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా కేక్ కట్ శుభాకాంక్షలు తెలియజేశారు..

అనంతరం వికలాంగులకి, వృద్ధులకు పులిహోర పంపిణీ చేశారు... బొందయ్య,ఖమ్మం జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ రేగురి వాసవి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు దోస్పాటి శేఖర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెర్రిపోతుల సత్యనారాయణ,నేలకొండపల్లి మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు,మండల కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గుడిబోయిన వెంకటేశ్వర్లు,గండు సైదులు,పసుపులేటి ఉపేందర్,చెరుకు రంగయ్య,లింగం వెంకన్న,లింగం శీను,నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొలుసు పవన్,కోడి రెక్కల వినోద్,పాలేరు నియోజకవర్గం యువజన కాంగ్రెస్ కో కో ఆర్డినేటర్ సోమనబోయిన సాయి నవీన్,గండు జానయ్య,కైలాసపు గోపి,రాయపూడి రోహిత్,తోట వాసు,మన్నె నరేష్,కాసాని సందీప్,గోనెగుంట్ల కోటేశ్వరరావు,గంధం నాగరాజు,కొమ్మూరి నరేష్,అనంతు మనోజ్,ఎర్ర శివ,కాసాని సత్యనారాయణ, కడియాల నరేష్, సమ్మటి శివ గణేష్,మాజీ ఎంపీటీసీ మారుతి సైదులు,ఎస్.కె లాల్ పాషా,మహబూబ్ పాషా,బచ్చలకూరి నాగేశ్వరరావు,బచ్చలకూరి సందీప్,షేక్ సైదా,పెద్దపాక ముత్తయ్య,బాలబోయిన గోపి, తదితరులు పాల్గొన్నారు..

# మండల అధ్యక్షుడు తోటకూరికి ఘన సన్మానం

- సమన్వయంతో పనిచేస్తూ...
- పార్టీ అభివృద్ధిలో శక్తి మేర పనిచేస్తా
- మండల అధ్యక్షుడు: తోటకూరి రాంబాబు



కారేపల్లి,జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ సింగరేణి మండల అధ్యక్షుడుగా నియమితులైన తోటకూరి రాంబాబు కు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సర్పంచులు,పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.సోమవారం స్థానిక సినిమా హాల్ సెంటర్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులుగా నియమితులైన తోటకూరి రాంబాబుకు పార్టీ కార్యకర్తలు,నాయకులు,సర్పంచులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మండల స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని అన్నారు.సంక్షేమ పథకాలలో అర్హులైన ప్రతి లబ్ధిదారులకు అందజేస్తూ పార్టీ సమన్వయంతో ముందుండి నడిపించాలని అన్నారు.కార్యకర్తలు పార్టీ నాయకుల సమన్వయంతో పనిచేస్తూ..కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో తన శక్తి మేర పనిచేస్తానని ఈ సందర్భంగా తోటకూరి రాంబాబు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపూడి తిరుమలరావు,విష్ణువర్ధన్ రెడ్డి,అడ్డగోడ ఐలయ్య,ఎండి యాకూబ్ అలీ,సర్పంచులు రంజిత్ కుమార్,మేదరి ప్రతాప్ ( టోనీ),హనుమంతరావు,హీరాలాల్,ఉండం రాఘవులు,మూతి వీరస్వామి,బాలు నాయక్,రాజు,మత్రు తదితరులు ఉన్నారు.

# బడులకు నామమాత్రంగా హాజరు

నేలకొండపల్లి జూన్ 15 (విజన్ ఆంధ్ర ): ప్రభుత్వ పాఠశాల లకు అమావాస్య ఎఫెక్ట్ పడింది. పాఠశాలలు ప్రారంభం సందర్భంగా... సోమవారం తొలిరోజు అంతంమాత్రమే విద్యార్థులు హజరైయ్యారు. ప్రారంభం రోజున విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. పచ్చటి తోరణాలు...పూలు చల్లుతూ విద్యార్థులను అహ్వానించారు. పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలను కూడ ప్రారంభించారు. పండుగ వాతావరణంలో పున ప్రారంభం జరిగింది. మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు పాఠశాల లను పర్య వేక్షించారు. తొలి రోజే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలను అందించారు.

## జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా పెంటనోళ్ల నరసింహ మాదిగ నియామకం

షాద్ నగర్, విజన్ ఆంధ్రా జూన్ 15 : జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.పెంటనోళ్ల నరసింహ మాదిగ ప్రస్తుతం ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో కొనసాగుతున్న ఉద్యమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత రెండు దశాబ్దాలుగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక సామాజిక ఉద్యమాలు చేపట్టి ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు.ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన నరసింహ మాదిగ సేవా దృక్పథాన్ని గుర్తించిన అధికారులు ఆయనను జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పెంటనోళ్ల నరసింహ మాదిగ మాట్లాడుతూ... తనకు ఈ అవకాశం కల్పించిన ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన సేవలను గుర్తించి అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దళిత, గిరిజన వర్గాల సంక్షేమం కోసం, వారిపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, వివక్ష, అణచివేతలను అరికట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణకు తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.

## కుల్కచర్ల నుంచి మర్పల్లికి..

- తహసిల్దార్‌గా మనోహర్ చక్రవర్తి నియామకం
- ఘన స్వాగతం మధ్య పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన తహసిల్దార్

మర్పల్లి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) మండల నూతన తహసిల్దార్‌గా మనోహర్ చక్రవర్తి సోమవారం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు కుల్కచర్ల తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన ఆయన, బదిలీపై మర్పల్లికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. మండల ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని మనోహర్ చక్రవర్తి తెలిపారు. ఇదివరకు మర్పల్లి మండల తహసిల్దార్‌గా విధులు నిర్వహించిన పురుషోత్తం బదిలీపై కుల్కచర్ల తహసిల్దార్‌గా వెళ్లారు.

# అర్హులైన పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు డిమాండ్

షాద్ నగర్, విజన్ ఆంధ్రా జూన్ 15 : రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇళ్లను డబుల్ బెడ్ రూమ్ లను ప్రభుత్వం నిర్మించి వెంటనే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఆయన ఆదివారం నాడు షాద్నగర్ పట్టణంలోని యూనివర్సల్ మినీ ఫంక్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా 12 వ మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని భూమిలేని పేదలకు సంవత్సరానికి 12,000 ఇవ్వాలని రైతుబంధు పూర్తిస్థాయిలో వేయాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం గడ్చిన 12 సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద ప్రజల నడ్డి విరిచే విధంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని పోరాటాలకు సమయసం చేయడం కోసం కార్మిక కర్షిక మైత్రితో ఈ యొక్క బీజేపీ ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లు గా తెచ్చి కార్మిక వ్యతిరేక విధానా లను అవలంబిస్తా ఉంది రైతందానికి వ్యతిరేకంగా రైతు చట్టాలను తీసుకొచ్చి రైతుల మెడలకు ఉరితాలుగా బిగిస్తున్న బిజెపి విధానానికి వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం కావాలని ఉపాధి హామీ కూలీలను పని దినాలను తగ్గిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తూ వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకకుండా కార్పొరేట్లకు ఊ డిగము చేసే విధంగా కొత్త చట్టాలను తీసుకొస్తా ఉండండి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు అదేవిధంగా ప్రజా పంపిణీ ద్వారా ఉచితంగా 14 రకాల సరుకులను ఇవ్వాలని గ్యాస్ సిలిండర్ పెట్రోలు నిత్యవసర సరుకులు ధరలను తగ్గించాలని ఆ విధంగా ప్రజలను ప్రభుత్వంపై పోరాటం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్నద్ధం చేయాలన్నారు చేయాలని ఆయన ప్రజలు రైతు కార్మిక వ్యవసాయ కూలీల ప్రజా సమస్యల పైన రానున్న రోజుల్లో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని కార్మికులను కూలీలను సంఘటితం చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వహించే పనుల్లో ఉందని జులై ఒకటో తేదీన పెద్ద ఎత్తున పోరాటం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు మా మహాసభలో జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెడుతూ మాట్లాడారు అనంతరం మండల ప్రతినిధులు చర్చలు జరిపి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించారు అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కందుకూరి జగన్ అంజయ్య ఉ పాధ్యక్షులుగా శ్రీనునాయక్, బేకరీ అంజయ్య, బి శివ, సహాయ కార్యదర్శిగా సిహెచ్ జంగయ్య, శ్యాంసుందర్ కుమార్, కమిటీ సభ్యులుగా కాళ్ల జంగయ్య, బీజాని అజయ్, బస్సు ఆవుల యాదయ్య, కాపురం దయ్యాల గణేష్, కావాలి జగన్, సిహెచ్ పుష్ప, సత్యం కావాలింజనేయులు, ఏ రవి, పి నరసింహ, సైదమ్మ అంబేద్కర్ దేవయా లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో

ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లాప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్, సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు, గిరిజన సంఘం జిల్లా ఉ పాధ్యక్షులు ఈశ్వర్ నాయక్, బేరి శ్రీనివాస్ ఆవాజ్ నాయకులు మహమ్మద్ బాబు రాజు ఏటూరి కురుమయ్య మరియు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో ఇంటర్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ తరగతులకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి స్వేత సోమవారం తెలిపారు. తెలుగు, ఫిజిక్స్, జువాలజీ సబ్జెక్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ ఉత్తీర్ణత కలిగిన వారికి అవకాశం ఉండగా, బి.ఎడ్ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు చేవెళ్లలోని కేజీబీవీ విద్యాలయాన్ని లేదా ప్రత్యేకాధికారి స్వేతను 9100439368 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## లింగాల గణపురం: ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

లింగాల గణపురం జూన్ 15 (విజన్ ఆంధ్ర) జనగామ జిల్లా లింగాల గణపురం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి. సునీత తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపుకు 40 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి జీపీఏ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. అలాగే 6వ, 7వ తరగతుల్లో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

## ప్రజావాణి లో ఎనిమిది దరఖాస్తులు...

బోధన్, జూన్ 15(విజన్ ఆంధ్ర) : బోధన్ డివిజనల్ ప్రజావాణి కార్యక్రమం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ విజయకుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. చేపట్టిన ప్రజావాణిలో మొత్తం 8 దరఖాస్తులు నమోదు అయ్యాయి. మునిసిపల్ పరిధి లో హౌస్ నంబర్ అలాట్మెంట్ గురించి, డ్రైనేజీ సమస్య, విద్యా శాఖ లో స్కూల్ ఫీసు సమస్య, రైతు బందు గురించి, ఇందిరమ్మ ఇల్లు, డెత్ సర్టిఫికెట్, భూమి సమస్యలు మొదలగు సమస్యల పైన ప్రజలు తమ సమస్యలని ప్రభుత్వం దృష్టి కి తీసుకువచ్చినట్లు కార్యాలయ అధికారులు వెల్లడించారు.

## సర్వీస్ రోడ్ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే గాంధీ

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 15: వివేకానంద నగర్ మెయిన్ రోడ్ లో మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. అదే విధంగా రోడ్డు మధ్యలో ఉన్న మూడు కరెంటు స్తంభాలు తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. శ్రీనివాసరావు,సంజీవరెడ్డి ఎండి ఇబ్రహీం మల్లయ్య శివ సాగర్, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కమిటీ సభ్యులు జి నర్సింగ్ రావు, శ్రీధర్, జి ప్రసాద్, కృష్ణ రాజు, నాయకులు సంజీవరెడ్డి ఎండి ఇబ్రహీం మల్లయ్య శివ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఊతం

**- ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌తో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భేటీ**



షాద్‌నగర్, విజన్ ఆంధ్రా జూన్ 15: షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను కలిసి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ..షాద్‌నగర్ నియోజకవర్గంలో తాగునీటి, సాగునీటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ అత్యంత కీలకమని అన్నారు. భూసేకరణ పనులు ఆలస్యం కాకుండా వెంటనే కార్యాచరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచిస్తానని తెలిపారు. అలాగే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్నందున ప్రత్యేక జీవో లేదా అదనపు అనుమతుల అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా చర్చించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని ఆదిత్యనాథ్ దాస్ హామీ ఇచ్చారు. దీంతో రిజర్వాయర్ నిర్మాణానికి ఉన్న పరిపాలనా అడ్డంకులు తొలగి పనులు మరింత వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ టి. కర్ణాకర్, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యువ కార్యకర్తల సమ్మేళనం

**- సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలను జయప్రదం చేద్దాం.**

**- జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. రాజు పిలుపు**

షాద్‌నగర్, విజన్ ఆంధ్రా జూన్ 15 : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో రంగారెడ్డి జిల్లా కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఎన్. రాజు పిలుపునిచ్చారు.సోమవారం షాద్‌నగర్ పట్టణంలో యువ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలనే ప్రధాన ఎజెండాగా తీసుకుని సమసమాజ నిర్మాణం, శ్రామిక ప్రజల విముక్తి, కష్టజీవుల హక్కుల సాధన కోసం సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువ కార్యకర్తలు ఈ సమావేశాల్లో పాల్గొని ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని కోరారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల భారం, రైతాంగ సంక్షోభం, కార్మికుల సమస్యలు, ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం కోసం పార్టీ కట్టుబడి పనిచేస్తోందన్నారు. రంగారెడ్డి జిల్లాలో డిండి--శివన్నగూడ ప్రాజెక్టు నిర్మాణం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇండ్ల స్థలాల పంపిణీ, పోడు భూముల సమస్యల పరిష్కారం, భూసేకరణలో రైతులకు న్యాయమైన పరిహారం, ఉపాధి హామీ పథకం బలోపేతం, అర్హులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు అందించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజల భూములు, హక్కులను పరిరక్షించేందుకు పార్టీ పోరాటాలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరింత విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు ఈ యువ కార్యకర్తల సమావేశాలు దోహదపడతాయని ఎన్. రాజు తెలిపారు. షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ తదితర ప్రాంతాల నుంచి యువత, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ టౌన్ కార్యదర్శి శ్రీను నాయక్, కొత్తూరు మండల కార్యదర్శి బీసా సాయిబాబు, నందిగామ మండల కార్యదర్శి కొంగరి నర్సింహులు, నాయకులు కే. రాజు, ముఖిత్, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల జోరు

**అద్భుత ఎస్సెస్సీ ఫలితాల ప్రభావంతో పెరుగుతున్న విద్యార్థుల చేరికలు**

**95.2 శాతం ఉత్తీర్ణత సాధించి మరోసారి సత్తా చాటిన పాఠశాల**

**14 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు**

**కొత్తగా చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ**

**స్మార్ట్ క్లాసులు, వృత్తి విద్యా కోర్సులతో ఆకట్టుకుంటున్న పాఠశాల**

జీడిమెట్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : వేసవి సెలవుల అనంతరం జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునఃప్రారంభమైంది. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయిని యు. కళ్యాణి తెలిపారు. పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను ప్రధానోపాధ్యాయిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2026 ఎస్సెస్సీ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు 95.2 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని అన్నారు. అంతేకాకుండా 14 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారని పేర్కొన్నారు. ఈ అద్భుత ఫలితాల ప్రభావం ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లపై కూడా కనిపిస్తోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం కనబరుస్తున్నారని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఆధునిక విద్యను అందించేందుకు పాఠశాలలో ప్రతి తరగతి గదిని స్మార్ట్ క్లాస్‌రూమ్‌గా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే విశాలమైన ఆట స్థలం, అన్ని సబ్జెక్టుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని చెప్పారు. 9వ, 10వ తరగతి విద్యార్థుల కోసం వృత్తి విద్య (వొకేషనల్) కోర్సులు కూడా నిర్వహిస్తున్నామని, విద్యతో పాటు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, ఉత్తమ ఫలితాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను జీడిమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించి ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయిని యు. కళ్యాణి కోరారు.

# చేవెళ్ల ఫీడర్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చేవెళ్ల,జూన్ 15 (విజన్ ఆంధ్ర) : చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల నేపథ్యంలో చేవెళ్ల ఫీడర్ పరిధిలో (నేడు) మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని టీజీఎస్పీడీసీఎల్ చేవెళ్ల ఆపరేషన్ ఏఈ తెలిపారు. చేవెళ్ల 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి చేవెళ్ల ఫీడర్‌కు సంబంధించి చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులను (నేడు) నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఒక ప్రకటనలో టీజీఎస్పీడీసీఎల్ చేవెళ్ల ఆపరేషన్ ఏఈ ఈ వివరాలను వెల్లడించారు. ఈ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వ్యవస్థను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులు తాత్కాలిక అసౌకర్యాన్ని సహించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# లోక్ అదాలత్ తో సమస్యలు పరిష్కారం

## -ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్




ముధోల్:15జూన్:విజన్ ఆంధ్ర : దీర్ఘకాలికంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోకుండా లోక్ అదాలత్ తో సమస్యలు పరిష్కారమవుతాయని ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.రాజీ పడదగిన కేసులో క్రిమినల్ సివిల్ తగాదా కేసులు, ట్రాఫిక్ చలన్ లు,ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు కక్షి దారులు రాజీ పడాలని సూచించారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బుల ను వృధా చేసుకోవద్దన్నారు. ఈనెల 20 తేదీలోపు నిర్వహించే లోక్ అదాలత్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు

# మన ఊరు - మన ప్రభుత్వ బడి

**- మాగనూరు మండలం**

జూన్ 15 ( విజన్ ఆంధ్ర) : మాగనూర్ మండల కేంద్రంలో
మంత్రిగారి ఆదేశాల మేరకు బడులు తెలిసిన రోజే పాఠ్యపుస్తకాల పంపిణీ
జరిగింది మాగనూరు మండలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ గారి ఆధ్వర్యంలో
మాగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రభుత్వ బడిలో పుస్తకాల పంపిణీ కార్యక్రమం

ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం శ్రీ రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారమే బడులు తెరిచిన రోజే పుస్తకాల పంపిణీ చేసిన స్కూల్ విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బాబుల్ రెడ్డి, సర్పంచ్,ఉప సర్పంచ్పూ. రాజు, కాంగ్రెస్ నాయకులు వాకిటి. ,శ్రీనివాస్ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది




# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

## - ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఏబీవీపీ

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 15 : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శిశు మందిర్ పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల లేమి వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని అన్నారు.మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని, దీనివల్ల పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు విద్య క్రమంగా దూరమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రైవేటు విద్యాసంస్థల కార్యక్రమాలకు హాజరవడం ద్వారా ప్రైవేటు శక్తులకు ప్రోత్సాహం ఇస్తున్నారనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని విమర్శించారు.రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తగ్గించి ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో కేవలం కొద్ది పాఠశాలలకే పరిమితం చేసే ప్రయత్నాలను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని, అయితే ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసి రెండు లేదా మూడు మండలాలకు ఒకే పాఠశాలను ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ, పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు.ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కొనసాగడం విద్యార్థుల హక్కు అని, ప్రభుత్వం ముందుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, అలాగే ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియపై పునరాలోచన చేసి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజాహిత నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర ఉపాధ్యక్షులు సంతోష్,అంజి,శరత్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# గంగన్నగూడ ప్రజల కల సాకారం

**- రూ.1.25 కోట్లతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**- వర్షాకాల రాకపోకల కష్టాలకు శాశ్వత పరిష్కారం**

షాద్‌నగర్, విజన్ ఆంధ్రా జూన్ 15: గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గంగన్నగూడ హై లెవెల్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. రూ.1.25 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో నిర్మించిన ఈ బ్రిడ్జిని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... వర్షాకాలంలో గంగన్నగూడ గ్రామ ప్రజలు రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని గుర్తు చేశారు. వరద నీటి కారణంగా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు.ఈ సమస్యను గుర్తించి ప్రజల అవసరాలకు అనుగుణంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు.గంగన్నగూడ నుంచి పరిసర గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ఈ బ్రిడ్జి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అధికారంలోకి వచ్చిన అనాది కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇచ్చి ఈ పనిని పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన అజెండా అని స్పష్టం చేశారు.బ్రిడ్జి ప్రారంభంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వంతెన గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు వ్యవసాయ, విద్య, వైద్య అవసరాల కోసం ప్రయాణించే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘం నాయకుడుపై తప్పుడు కేసులను ఎత్తివేయాలి...

## బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆర్డీఓ, ఏసీపీ లకు వినతిపత్రం..



బోధన్, జూన్ 15(విజన్ ఆంధ్ర) : విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజుపై కేసులను ఎత్తివేయాలని బోధన్ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డిఓ విజయకుమారి, ఏసీపీ శ్రీనివాస్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు ఎన్.బాల్ రాజ్ మాట్లాడుతూ బోధన్ పట్టణంలో గల చైతన్య ఒకేషనల్ కళాశాల యాజమాన్యం కిషన్ విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా చదువు పూర్తి అయిన విద్యార్థులకు టీసీ, మెమో లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. మా తోటి విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజుకు సదురు విద్యార్థులు ఈ విషయాలు చెప్పడం మూలంగా విద్యార్థి సంఘం నాయకుడు నాగరాజు పలుమార్లు యాజమాన్యంతో మాట్లాడిన సానుకూలంగా స్పందించక పోవడం జరిగిందన్నారు. యాజమాన్యం మా కళాశాల మా ఇష్టం మీరెవరు మాకు చెప్పడానికి అని దురుసుగా నాగరాజు తో మాట్లాడి కావాలనే కక్షపూరితంగా తప్పుడు ఆరోపణలు చేసి కేసుపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. కావున అధికారులు పూర్తి స్థాయిలో చైతన్య ఓకేషనల్ కళాశాలపై సమగ్ర విచారణ జరిపి కళాశాల యాజమాన్యం కిషన్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా కళాశాల యాజమాన్యం విధానం మార్చుకొని విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇచ్చేయాలని, లేని పక్షంలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎంతవరకైనా పోరాడతామన్నారు. విద్యార్థులను సమస్యలకు గురి చేస్తే ఎవ్వరిని కూడా ఉపేక్షించమని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎండి మోషిన్, తల్లూరి సంజయ్, ప్రతాప్, రాజన్న, కిరణ్, మోహన్, రాజు, శ్రీను లు పాల్గొన్నారు.

# గొర్రెల కాపరి గోపాల్‌పేట-చెన్నూర్ రోడ్డు శివారులో దారుణ హత్య



గోపాల్ పేట జూన్ 15 (విజన్ ఆంధ్ర ):: వనపర్తి జిల్లా ఏదుల మండలం మాచుపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బుత్కూరి బాలచంద్రి (50) గోపాల్‌పేట–చెన్నూర్ రోడ్డు శివారులో దారుణంగా హత్యకు గురయ్యాడు. గొల్ల మల్లేష్ తమ గొర్రెల మందకు బాలచంద్రి కావలా ఉండటానికి అంగీకరించకపోవడం. మల్లేష్ చేసే గొర్రెల దొంగతనం విషయాలను బాలచంద్రి అందరికీ చెపుతాడనే అనుమానం మనసులో పెట్టుకోవడం. దాడి మరియు హత్య: జూన్ 13న ఉదయం గొల్ల మల్లేష్, అతని భార్య సుమతి, తల్లి నీలమ్మ కలిసి ఒకే బైక్‌పై వచ్చి కట్టెలతో బాలచంద్రిని తీవ్రంగా కొట్టారు. మల్లేష్ పిడిగుద్దులతో కడుపులో, డొక్కల్లో బలంగా గుద్దాడు. ఆ దెబ్బలకు బాలచంద్రి కింద పడిపోగా, మల్లేష్ అతని ప్యాంటు విప్పేసి, తాను వెంట తెచ్చుకున్న కటింగ్ బ్లేడ్ (జబ్అబఅన్ర్యాశ్రీఅవతీ) తో అంగాన్ని లాగి దారుణంగా కొట్టి చంపారు.

కేసు నమోదు: మృతుడి భార్య బుత్కూరి వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాల్‌పేట పోలీసులు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సర్వీస్ రోడ్ పనులను పూర్తి చేయాలి : ఎమ్మెల్యే గాంధీ

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 15: వివేకానంద నగర్ మెయిన్ రోడ్ లో మిగిలిపోయిన సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజల అందుబాటులోకి తీసుకురావాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. అదే విధంగా రోడ్డు మధ్యలో ఉన్న మూడు కరెంటు స్తంభాలు తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్. శ్రీనివాసరావు,సంజీవరెడ్డి ఎండి ఇబ్రహీం మల్లయ్య శివ సాగర్, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి కమిటీ సభ్యులు జి నర్సింగ్ రావు, శ్రీధర్, జి ప్రసాద్, కృష్ణ రాజు, నాయకులు సంజీవరెడ్డి ఎండి ఇబ్రహీం మల్లయ్య శివ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డిపల్లిలో ప్రైమరీ స్కూల్ ప్రారంభోత్సవం

**- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**

నర్సాపూర్ 15 జూన్ (విజన్ ఆంధ్ర) నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్ మండల్ రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభించి,విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా, అత్యుత్తమ నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, వార్డు సభ్యులు మహేష్ గౌడ్, ఉపాధ్యాయులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# సోనాల మండల కేంద్రంలో యోగా వాక్

బోథ్, జూన్ 15. (విజన్ ఆంధ్ర)లి అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకొని ఆయుష్ విభాగ్ ఆధ్వర్యంలో సోనాల మండల కేంద్రంలో సోమవారం యోగా శిక్షకురాలు మునిగెల యోగిత ఆధ్వర్యంలో యోగా వాక్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె యోగ వలన కలిగే ప్రయోజనాలు, యోగ చేయడం వల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారని అన్నారు. ఉరుకుల పరుగుల జీవితంలో నిత్యం యోగ చేయడం తప్పనిసరని గ్రామస్థులకు తెలిపారు. యోగా ఆసనాలు వేయడం వల్ల వ్యక్తి నియంత్రణలో ఉంటారని, గర్భిణీలకు సాధారణ ప్రసవం జరిగేలా కూడా ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 6గంటలకి ఆయుష్ విభాగం లో యోగ ప్రత్యేకంగా మహిళలకు, వృద్ధులకు, గర్భిణులకు నేర్పించబడుతుందని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ప్రీతల్ రాథోడ్ తెలిపారు. ప్రీతల్ రాథోడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా జూన్ 12 నుండి 21 తేదీ వరకు ప్రణాళిక కార్యక్రమాలు ఉన్నాయని అందులో భాగంగా సోమవారం యోగా వాక్ ,16 తేదీ మంగళవారం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి యోగా,ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి అవగాహన ఉంటుదని



ఇందులో ఆశ వర్కర్లు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనాలనీ కోరారు. 17 తేదీన గ్రామ ఆరోగ్య పారిశుధ్య ఆరోగ్య కమిటీ ఉ పోషకాహార కమిటీ భాగస్వామ్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ 2026 థీమ్ అయినటువంటి ప్రతి ఒక్కరికి యోగా అని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గ్రామంలో వివిధ రాజకీయ నాయకులకు యోగా పైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలనీ కోరారు. జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా యోగ సంగమం కూడా ఉంటుందని ఈ కార్యక్రమాలలో భారీ ఎత్తున ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయగలరని ఆమె తెలిపారు.

# రైతులకు ఉరితాడుగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**- నందిపేట్‌లో రైతులతో కలిసి రోడెక్కిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి**

ఆర్మూర్ జూన్15:( విజన్ ఆంధ్ర ) : ఆర్మూర్ నియోజకవర్గం లోని నందిపేట్ లో సోమవారం నాడు బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగినది రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తూ, వ్యవసాయాన్ని కుంటుపరిచేలా ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో రైతులు చేపట్టిన భారీ ధర్నాలో నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ అధ్యక్షులు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జీవన్ రెడ్డి, మాట్లాడుతూ, సాంకేతికత పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు ఉపయోగపడటం కన్నా ఇబ్బందులు సృష్టిస్తోందని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, స్మార్ట్‌ఫోన్‌లు లేని రైతుల పరిస్థితిని ప్రభుత్వం



పూర్తిగా విస్మరించిందన్నారు. యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడం వల్ల రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యవసాయాన్ని సులభతరం చేయాల్సిన ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో రైతులపై అదనపు భారాన్ని మోపుతోందని విమర్శించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందక పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూరియా యాప్ కారణంగా బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందని, రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగానికి ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నారని, కానీ నేడు రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మునుపటిలాగే గుర్తింపు కార్డుల ఆధారంగా నేరుగా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నందిపేట్ మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా సరిపడా యూరియా, ఇతర ఎరువుల నిల్వలను ప్రభుత్వం వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,నందిపేట్,డొంకేశ్వర్ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతి కాశిరెడ్డి నాయన క్షేత్రాన్ని దర్శించుకున్న డీసీసీబి చైర్మన్ మంచూరు

బద్వేలు, జూన్ 15 (విజన్ ఆంధ్ర) బద్వేలు నియోజకవర్గం కాశి నాయన మండలం ప్రముఖ జ్యోతి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ కాశిరెడ్డి నాయన ఆలయాన్ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి సోమవారం ఉదయం తన అనుచరులతో వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం స్వామివారి సన్నిధిలో జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని సకాలంలో వర్షాలు విరివిగా కురిసి రైతులు పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు అలాగే జ్యోతి క్షేత్రం ఆధ్యాత్మిక చైతన్యానికి నిలయంగా నిలుస్తూ భక్తులకు విశేషమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కాశి నాయన మండల టిడిపి నాయకుడు వెంకటరెడ్డి, చెరుకూరి రవి, కలసపాడు సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ దుగ్గిరెడ్డి, ప్రహ్లాద రెడ్డి, బాలిరెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## సిఐటియు కార్మికుల అధ్యక్షుడు మడికొండ ప్రమోద్ కుమార్ అధ్యక్షతన పరకాల మున్సిపాలిటీ నూతన కమిషనర్ శాలువాతో సన్మానం

పరకాల జూన్ 15 విజన్ ఆంధ్ర : పరకాల మున్సిపాలిటీ కొత్తగా వచ్చిన కమిషనర్ పోతురాజు పవన్ మున్సిపాలిటీ కార్మికుల తరపున సన్మానించడం జరిగింది మరియు అదేవిధంగా గత 30 సంవత్సరాలుగా గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీ వరకు 300 జీతంతో పనిచేసిన 20 మంది కార్మికులను 60 సంవత్సరాలు నిండినయని. తీసివేయడం జరిగింది. వారికి న్యాయం చేయాలని వారి తరఫున వారి కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని. కమిషనర్ కి మెమొరండం ఇస్తూ అదే విధంగా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్. కార్మికులను పర్మినెంట్ చేస్తుంటే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని. హామీ ఇచ్చి కార్మికులకు మొండి చేయి చూపిస్తుంది. ఇప్పటికే రాజస్థాన్లో ఒరిస్సాలో పంజాబ్లో హర్యానాలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయడం జరిగింది ఇటీవలనే ఆంధ్రప్రదేశ్. లో హైకోర్టు. కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ కార్మికులను. పర్మినెంట్ చేయాలని తీర్పు ఇవ్వడం జరిగింది. కావున మన తెలంగాణ రాష్ట్రంలో కూడా మున్సిపాలిటీ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి 26 వెయ్యిల వేతనం కల్పించాలని

కార్మికుల పక్షాన సిఐటియు జిల్లా నాయకులు తలారి ఉప్పలయ్య భయ్యా కృష్ణంరాజు. మరియు మున్సిపాలిటీ సిఐటియు కార్మికుల నాయకులు. పసుల సారయ్య.బొచ్చు ఐలయ్య , చెరుకు నాగరాజ్. కోగీల సుమన్ , బొచ్చు సురేష్, బుస రవి , ఒంటేరు సారయ్య ముఠా కొమ్ముల మహేష్ మరియు కార్మిక సిబ్బంది తదితరులు



పాల్గొని మెమొరండం ఇవ్వడం జరిగింది అదేవిధంగా. జూన్ 18. 19. తేదీలలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు టెంటు వేసి నిరాహార దీక్షకు కూర్చుంటామని

జూన్ 22 విధులు బహిష్కరించి జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు

నిర్వహిస్తూ 29. 30 తేదీలలో ఎమ్మెల్యేలు మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామని

మా ప్రతి కార్మికుని ఆవేదన ముఖ్యమంత్రికి తెలియపరచాలని. కోరుతూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు విజ్ఞప్తి చేస్తుంది. సిఐటియు కార్మికుల అధ్యక్షుడు మడికొండ ప్రమోద్ కుమార్

# కాళ్లు లేవు .... కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూపు

- అధికారుల నిర్లక్ష్యంలో ఓ నిరుపేద కుటుంబం
- కొండకోనల్లో జీవించే ఆదివాసికి కొండంత కష్టం ..
- భర్తకు దిక్కు అనాధకు తానే అమ్మ
- సుశీలకు వీరే రెండు కళ్ళు

చర్ల ,జూన్ 15 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చతిస్గడ్ రాష్ట్రానికి చేరువలో ఉన్న మారుమూల అటవీ గ్రామం బక్కచింతలపాడు గ్రామం లో ఒక సంఘటన కుటుంబంలో విషాదం నెలకొల్పింది , ఆ కుటుంబం పై

విధి వక్రీకరించింది బ్రతుకుదెరువు కోసం వెళ్లిన చోట ప్రాణాలనే పణంగా పెట్టాల్సి వచ్చింది, ఒకరు కాదు ఆ కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు అంగవైకల్యంతో ఒకరు శారీరకంగా , మరొకరు మానసికంగా చితికిపోతున్నారు,అండగా ఉండాల్సిన ప్రభుత్వం, కనికరించాల్సిన వ్యవస్థ మౌనంగా ఉండటంతో ఆ పేద కుటుంబం ఇప్పుడు జీవిత శిక్షను అనుభవిస్తూ కష్టంతో శోకసంద్రంలో చావుబతుకుల మధ్య సతమతమవుతోంది.

**ప్రమాదం పేదరికాన్ని ముంచెత్తింది**

2019లో జరిగిన ఒక దురదృష్టకరమైన ప్రమాదం, ఇడమయ్య జీవితాన్ని తలకిందులు చేసింది. పనుల కోసం వెళ్లిన చోట విద్యుదాఘాతానికి గురై, తన రెండు కాళ్లను కోల్పోయాడు, అప్పటివరకు ఆ ఇంటికి వెలుగుగా ఉన్న ఇడమయ్య మంచానికే పరిమితమయ్యాడు,ఆ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది

**ఆకలి కేకల మధ్య చిన్నారి ప్రాణం**

ఒక చిన్నారి తల్లి చనిపోవడంతో, ఆ కష్టాల్లోనూ ఆ చిన్నారిని ఆ కుటుంబం దగ్గరకు తీసుకుంది, సొంత కడుపున పుట్టిన వారికి అంటే ఎంతో ఇష్టంగా ఆ పచ్చి పాపను పెంచుకుంటున్నారు, పూట గడవడం కష్టమైనా ఆ పసిపాపపై ప్రేమతో ఆ దంపతులు బతుకు బండిని నెట్టుకొస్తున్నారు, ఇడుమయ్య భార్య సుశీల కూలి పనులకు వెళ్తూ ఆ చిన్నారిని అంగవైకల్యం ఉన్న భర్తను కాపాడుకుంటోంది.

**అందినది సాయం కాదు కన్నీళ్ల సానుభూతే**

2024లో ఇడమయ్యకు అంగవైకల్య ధృవీకరణ పత్రం అందింది, కానీ దానికి రావాల్సిన పింఛను మాత్రం అతనికి అందని ద్రాక్షే అయ్యింది, పదేళ్లుగా పింఛను కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా



ఎవరు పట్టించుకోని దుస్థితి, ఇంటివద్దే ఉంటూ కనీసం ప్రభుత్వం అందించే రుణాలతో కిరాణా కొట్టు పెట్టుకుని బతుకుదామని అనుకున్నా ప్రభుత్వం ఈ వికలాంగున్నీ విస్మరించడం తో సొంత పెట్టుబడి లేక అదీ సాధ్యం కాలేదు

**సహృదయుల కోసం ఎదురుచూపులు**

కాళ్లు లేకపోయినా కనీసం పింఛను వస్తే ఈ పసిపాపనైనా ఆదుకుంటాం అని సుశీల కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది, వారి దీనస్థితిని చూసి చలించిన స్థానికులు చేతనైన సహాయం చేయాలని కోరుతున్నారు, ఇడమయ్యకు ప్రభుత్వం వెంటనే పింఛను మంజూరు చేయాలని, దాతలు ఆదుకోవాలని 'విజన్ ఆంధ్ర' వేడుకుంటోంది,ఈ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది,

**కన్నీటి చినుకుల్లోనూ భార్యగా చిగురించిన మానవత్వం**

జీవితం ఒక్కోసారి ఊహించని మలుపులు తిరుగుతుంది,బ్రతుకుదెరువు కోసం కష్టపడే ఆ దంపతుల జీవితంలో జరిగిన ప్రమాదం వారిని శారీరకంగా కృంగదీసినా, మానసికంగా మరింత దగ్గర చేసింది

చర్ల మండలం, బక్కచింతలపాడు గ్రామానికి చెందిన ఇడమయ్య, సుశీల దంపతులు, తమ బ్రతుకుదెరువు కోసం 2019లో పాల్వంచకు వలస వెళ్లారు, అక్కడ భవన నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండగా, దురదృష్టవశాత్తూ ఇడమయ్యకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి, ఈ ప్రమాదంలో ఆయన రెండు కాళ్లను కోల్పోవడమే కాకుండా, చేతులు కూడా చచ్చుబడిపోయాయి, ఆసుపత్రిలో రెండు నెలల పాటు చికిత్స పొంది స్వగ్రామానికి తిరిగి వచ్చారు, సర్వం కోల్పోయిన ఆ స్థితిలో వారికి మిగిలింది కేవలం ఒకరిపై ఒకరికి ఉన్న అంతులేని ప్రేమ మాత్రమే,

ఆసుపత్రి నుండి తిరిగి వచ్చాక, ఇడమయ్యకు సుశీలే లోకమైంది. తన భర్తకు కాళ్లకు బదులుగా తనే అడుగులై, చేతులకు బదులుగా తనే కర్మమై సేవలు చేస్తోంది, కన్నీళ్లను దిగమింగుకుంటూనే, తన భర్తను కనిపెట్టుకుని ఉంటోంది,మనుషులు మారలేదు, మానవత్వం ఇంకా బ్రతికే ఉంది అంటూ వారి దీనస్థితిని చూసి గ్రామస్థులు చలించిపోయారు, వారి వంతుగా కనీసం తలదాచుకోవడానికి ఒక చిన్న ఇల్లు కట్టించి ఇచ్చారు, అభాగ్యులైన ఆ దంపతులు, తమకు ఉన్నంతలో తల్లిని కోల్పోయిన ఒక చిన్నారిని దత్తత తీసుకుని ఆదరిస్తున్నారు,నిజమైన సంపద అంటే డబ్బు కాదు, కష్టాల్లోనూ తోటివారికి చేయూతనిచ్చే గొప్ప మనసు అని ఈ జంట నిరూపిస్తోంది, ప్రభుత్వం వీరికి చేయూతనందించి మీరు కుటుంబాన్ని ఆదుకుంటే మీరు భవిష్యత్తు లో కట్టుకున్న భర్తను కళ్ళకద్దుకొని చూసుకుంటూ, పసి పాపను ఆదరిస్తూ, వీరిద్దరిని రెండు కళ్ళుగా భావించే సుశీల కుటుంబంలో చీకటి నుంచి వెలుగుల ప్రసరించాలని , ఇడుమయ్యకు జీవన ఉపాధి కల్పించి వికలాంగుల పెన్షన్ అంతేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు దక్షిణ చీరలు తీసుకుంటే మానవత్వానికి నిరుపేద కుటుంబానికి సహాయం చేసిన వారు అవుతారు అని ఈ దంపతులు దీనస్థితిలో వేడుకుంటున్నారు.

మడకం ఇడుమయ్యా బార్య సుశీల: కలెక్టర్ సారుకి ఐటిడిఏ పి ఓ సారుకి విన్నపం , నా భర్తకు కాళ్ళు లేవు, ఓ తల్లి లేని పసిపాపను పెంచుకుంటున్న వీరిద్దరే నాకు రెండు కళ్ళు, నా భర్తకు పింఛన్ ఇప్పటివరకు లేదు, పింఛన్ సదుపాయం కల్పించి, బతుకుదెరువుకు ఆసరాగా ప్రభుత్వం అండగా ఉంటే మా భారం కొంత తగ్గుతుంది , నేనొక్కదాన్నే కష్టపడుతున్న ఇల్లు గడవటం చాలా కష్టంగా ఉంది, సారు మా కుటుంబాన్ని ఆదుకోండి సారు.



# సాయిబాబా ఆలయంలో చోరీకి యత్నం

**- స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు**

**- పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు.**

నిజామాబాద్ జూన్15:( విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ నగరంలోని హమాల్వాడి ప్రాంతంలో గల సాయిబాబా మందిరంలో దొంగలు చోరీకి యత్నించారు.. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు దొంగలు ఆలయంలో చొరబడి చోరికి ప్రయత్నించారు. ఆలయంలో అలజడి కావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే డయల్ 100 కు ఫిర్యాదు చేశారు. వెంటనే త్రీ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకొని ఆలయంలో చోరీకి యత్నిస్తున్న ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారిని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులకు చిక్కిన దొంగలు పంజాబ్ కు చెందిన ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా విచారణ చేపట్టారు. ఆలయంలో చోరికి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.. మేకల జ్యోతి



( విజన్ ఆంధ్ర) ప్రతినిధి జూన్ 15 : ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు సాగుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మీకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, విజయాలు చిరకాలం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా మీరు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము. మీ మహిళా పాత్రికేయురాలు మేకల జ్యోతి తరఫున జన్మదిన శుభాకాంక్షలు.

# గ్రామపంచాయతీ వర్కర్స్ జీతాలు పెంచాలి

**బి టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్**

కొత్తకోట జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట: గ్రామపంచాయతీలో పని చేస్తున్న వర్కర్స్ కు జీతాలు పెంచి బీమా సౌకర్యం కల్పించాలని వారికి నెలనెల జీతాలు చెల్లించాలంటూ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టి ఎంపీడీవో వినీత్ కు వినతి పత్రం అందజేసి గ్రామపంచాయతీ వర్కర్స్ కు నెలనెల జీతాలు ఇచ్చి వారికి 26వేలు తక్షణమే జీతాలు పెంచి బీమా సౌకర్యం ఈఎస్ ఐపీఎస్ సౌకర్యం గ్రామపంచాయతీ కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని గ్రామపంచాయతీలో అదనపు సిబ్బందిని నియమించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ మండల యూనియన్ నాయకులు కరీం, బొజ్జన్న, వెంకటేష్, బాలరాజు, బాలయ్య, హనుమంతు, బాల కొండయ్య, రాములు, శాలిమియా తదితరులు పాల్గొన్నారు.



# వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

**-: సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్.**

వెల్దండ జూన్ 15 (విజన్ ఆంధ్ర). రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని భూధర్పేట ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద అధికారులు, నాయకులతో కలిసి వనమహోత్సవం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్త ప్రాణుల జీవన మనుగడకు చెట్లే ఆధారం అన్నారు. భవిష్యత్ తరాలకు ఇబ్బందులు రాకుండా ఉండాలి అంటే మనిషికి ఒక మొక్క నాటడంతో పాటు మొక్కలను సంరక్షిస్తూ పెంపకాల బాధ్యతలను తీసుకోవాలన్నారు. ప్రజల మనుగడకు చెట్లు ఉండాలి కాబట్టి ప్రభుత్వం రోడ్ల వెంబడి కానీ ఊర్లలో కానీ పండ్ల చెట్లు, వేప చెట్టు ఎక్కువగా పెంచేలా చూడాలన్నారు.



కార్యదర్శి గిరి, సత్యనారాయణ, వార్డు సభ్యులు పసునోజు వాణి పురుషోత్తం, ముదికొండ కవిత రమేష్, నాయకులు చిమ్ముల తిరుపతి రెడ్డి, వెంకట్, ఎన్ఆర్జిఎస్ మెట్ మంజుల, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల కన్న అన్నదానం మిన్న

**- శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం**

**- అన్నదాత మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతు**

మక్తల్ జూన్ 15 ( విజన్ ఆంధ్ర) శ్రీ శ్రీ శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం యాదవ్ నగర్ నందు అమావాస్య సందర్భంగా అన్నదాత వాకిటి మానస హన్మంతు మున్సిపల్ చైర్మన్ వారి కుటుంబ సభ్యులు కూతురు కుమారులు మాపీశ్విత ,సాయి ప్రవజ్ఞ, జయ ఆవిత్ర్య మామయ్య బ్యాంక్ కిష్టప్ప ,వరలక్ష్మి, అంబిక వారిచే గుడి పూజారి గోత్రం చింతల బోయినోళ్ళ మంత్రోచ్చరణలచే ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కమిటీ పెద్దలు మాట్లాడుతూ.. ప్రతి అమావాస్య నాడు భక్తుల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం అన్నదాత కు కమిటీ పెద్దలు సన్మానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో



అన్నదాత మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, నాయకులు కట్ట సురేష్,గుడి నిర్వాహకులు జి. శివకుమార్ మేస్త్రి,కల్లూరి నాగప్ప,జి. శివ కుమార్, ఈసారి నాగప్ప,మేకలి అంజి,మాస్టర్,ఔసలి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

**ఈనెల 21హైదరాబాద్ లో జరిగే**

# తెలంగాణ ఉద్యమ కారుల సదస్సు విజయ వంతం చేద్దాం

ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ నిజామాబాదు జూన్ 15:-

ఈనెల 21 నా హైదరాబాద్ లోని ధర్నా చౌక్ ఇందిరా పార్క్ వద్ద జరిగే సదస్సుకు తెలంగాణ రాష్ట్ర సాధన సమరయోధు లందరు హాజరు కావాలని నిజామాబాదు జిల్లా ప్రజా ఉద్యమ కారుల సంక్షేమ సంగం,తెలంగాణ రాష్ట్ర సాధన సమరయోధుల గుర్తింపు పత్రాల సంక్షేమ సంగం అధ్యక్షులు బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు సోమవారం రోజు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలియజేసారు. సదస్సును తెలంగాణ ఉద్యమ కారుల సంగం వ్యవస్థాపకులు ఏస్.సి.

కోర్పొరేషన్ మాజి డైరెక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ఈ సదస్సులో

రాష్ట్ర మంత్రులు ఉద్యమ నాయకులు పాల్గొంటున్నారని నర్సింగ్ రావు వివరించారు.

ఇది ఇలా ఉండగా తెలంగాణ రాష్ట్ర సాధన సమరయోధుల గుర్తింపు పత్రాలని రాష్ట్ట ప్రజా ఉద్యమ కారుల సంక్షేమ సంగం అధ్యక్షులు జి. ఇన్నయ్య మరియు యంగ్ లీడర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి తెలంగాణ రాష్ట్టం కోసం పోరాడిన ఉద్యమ కారుల్ని గుర్తించి గుర్తింపు పత్రాలు జారీ చేశారని గుర్తు చేస్తూ ఇందులో భాగంగా నిజామాబాదు జిల్లా లో కూడా గుర్తింపు పొందిన ఉద్యమ కారులు తాము పొందిన ధ్రువపత్రాలను ఈ నెల 19 తేదీ శుక్రవారం సాయంత్రం 5:00 లోపు వాట్సాప్ 9666759297 కు పంపాలని నిజామాబాదు జిల్లా గుర్తింపు పత్రాల సమర యోధుల సంగం అధ్యక్షులు బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు విజ్ఞప్తి చేసారు.

ఉద్యమ కారుల్ని ఆదుకోవాలి

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు 10 లక్షల ఆరోగ్య భీమా,నెల నెల పెన్షన్ కేటాయించాలని నిజామాబాదు జిల్లా ప్రజా ఉద్యమ కారుల సంక్షేమ సంగం,తెలంగాణ రాష్ట్ర సాధన సమరయోధుల గుర్తింపు పత్రాల సంక్షేమ సంగం అధ్యక్షులు బ్రాహ్మ రౌతు నర్సింగ్ రావు



ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేసారు.

తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, ఉద్యోగాలు వస్తాయని, తెలంగాణ ఉద్యమంలో అన్ని కులాల వారు నిరుద్యోగులు

తెలంగాణ ఉద్యమంలో పాల్గొనగ,ప్రత్యేక తెలంగాణ వస్తే నిరుద్యోగ వ్యాయమ ఉపాధ్యా యులు ఉద్యోగాలు వస్తాయానే ఆశతో రోడ్ల పై కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ ఆడారని, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ని వివిధ వృత్తుల వారైనా నిర్మల్ కొయ్య బొమ్మలు, నకాష్ కులం, కమ్మరి, కుమ్మరి, మగ్గం చేసి పద్మ శాలి, స్వర్ణ కారులు మరియు ఇతర కులాలాల వారు తమ పని ముట్లతో రోడ్ల పై పనులు చేస్తూ నిరసన వ్యక్తం చేసిన వారు కూడా ఉన్నారని నర్సింగ్ రావు గుర్తు చేసారు. గత బి. ఆర్.ఎస్. ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ కారులను గుర్తించ లేదని,తద్వారా చాలా మంది ఉద్యమకారులకు ఆరోగ్య సమస్యలతో ఉన్నారని,ఇది ఇలా ఉండగా తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లిన వారు, జైలుకు వెళ్ళని వారు,ఉన్నారని ఉద్యమంలో పాల్గొన్న వారిని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఇన్నయ్య రాష్ట్ర వ్యాప్తశీగా పర్యటించి తెలంగాణ ఉద్యమ కారులుగా గర్తింపు పత్రాలు జారీ చేసారని నర్సింగ్ రావు గుర్తు చేస్తూనే,ఉద్యమ కారులందర్నీ ప్రభుత్వం గుర్తించి ఆరోగ్య భీమా,తో పాటు నెలకు 10 వేల పెన్షన్ తో పాటు 250 గజాల స్థలంతో పాటు ఉద్యమకారులకు వర్తింప జేయాలనీ, నర్సింగ్ రావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కొరడా.. మూడు టిప్పర్లు స్వాధీనం

కల్వకుర్తి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట గ్రామ శివారులోని రామగిరి ప్రాంతంలో నిన్న రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఈ టిప్పర్లు పట్టుబడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి టిప్పర్ డ్రైవర్లు, యజమానులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ఈ సందర్భంగా కల్వకుర్తి ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా ఇటువంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం అందించాలని కోరారు.

## పండుగలా బడుల పునఃప్రారంభం

### తొలిరోజే పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ

చిన్నంబావి, జూన్ 15:(విజన్ ఆంధ్ర) : వేసవి సెలవుల అనంతరం సోమవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉత్సాహంగా పునఃప్రారంభమయ్యాయి. తొలిరోజు బడికి వచ్చిన చిన్నారులకు ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. మొదటి రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ? కొప్పునూర్‌లో.. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట' నిర్వహించారు. సర్పంచ్ వడ్డెమన్ బిచ్చన్న చిన్నారులకు యూనిఫామ్ అందజేసి, అంగన్‌వాడీలే పిల్లల భవిష్యత్తుకు తొలి పునాది అన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శివరాముడు, ఉపాధ్యాయుడు మధుతో కలిసి పుస్తకాలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోని, టీచర్లు ఖాజాభాను, మన్నెమ్మ పాల్గొన్నారు. ? పెద్దమారూర్‌లో .. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అలివేలు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. తొలిరోజే ఉచిత పుస్తకాలు అందజేశారు. మౌలిక వసతులున్న ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్, రత్నయ్య, శ్యామల, శివలీల పాల్గొన్నారు. మండలంలోని మిగిలిన గ్రామాల్లోనూ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడుల పునఃప్రారంభ వేడుకలు విజయవంతంగా జరిగాయి.

## పట్టణ అభివృద్ధి, వర్షాకాల ముందస్తు చర్యలపై కల్వకుర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కల్వకుర్తి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి పురపాలక సంఘం గౌరవ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈరోజు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరయ్యారు.

సమావేశంలో పట్టణ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. అలాగే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీల శుభ్రత, నీటి నిల్వలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి అవసరమైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అస్మిత ఖేలో ఇండియా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్ లు అందజేత



మక్తల్, జూన్ 15 ( విజన్ ఆంధ్ర ) : అస్మిత ఖేలో ఇండియా సౌత్ జోన్ కోఆర్డినేటర్ పాషాబై, తెలంగాణ సైకిలింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి. మల్లారెడ్డి, బి. విజయ కాంతారావు ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి. గోపాలం ఆధ్వర్యంలో ఈ నెల 13న, నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణం కొత్త గార్లపల్లి రోడ్డులో ఖేలో ఇండియా సైక్లింగ్ ఉమెన్స్ సిటీ లీగ్ (ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా) బాలికలసబ్ జూనియర్, జూనియర్, మహిళల సీనియర్ రోడ్డు స్పీడ్ సైకిల్ పోటీలలో 256 మంది పాల్గొని, నారీ శక్తిని, క్రీడా ప్రతిభను చాటిన మహిళల విభాగమున జి .త్రివేణి ప్రథమ స్థానం ,టి. అనూష ద్వితీయ స్థానం, టీ. అవంతి తృతీయ స్థానం, బాలికల జూనియర్ విభాగమున కే. త్రివేణి ప్రథమ స్థానం, ఆర్. కళ్యాణి ద్వితీయ స్థానం, టి. శిరీష తృతీయ స్థానం, సబ్ జూనియర్ విభాగమున అభిజ్ఞ ప్రథమ స్థానం, కే. అంబిక ద్వితీయ స్థానం, పి. శ్రావణి తృతీయ స్థానం పొంది మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందు కున్నట్లు ప్రధాన కార్యదర్శి బి. గోపాలం తెలిపారు. అలాగే పాల్గొన్న 256 మంది బాలికలు, మహిళలకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సైకిలింగ్ క్రీడలకు ఎంపికైన సైకిల్ రైడర్స్ జూలై మొదటి వారంలో హైదరాబాదులో జరుగు రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడలలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. ప్రధాన కార్యదర్శి బి.గోపాలం మాట్లాడుతూ సైకిల్ క్రీడల వలన చాలా ప్రయోజనాలు ఉన్నాయని, సైకిల్ తొక్కడం వలన సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్స్ ఉపయోగపడతాయని, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అన్నదాత సైక్లింగ్ చైర్మన్ డాక్టర్ మణికంఠ గౌడ్, అధ్యక్ష కార్యదర్శులు తాను సింగ్, బి. గోపాలం, ఉపాధ్యక్షుడు జి. శివకుమార్ పిడి,పిఈటిలు విష్ణువర్ధన్, రేణుక, ఈశ్వర్, ఏ . విశాలి, అమ్రేష్, త్రివేణి, దామోదర్, మీనా కుమారి, ఆర్. స్వప్న, టి. అవంతి ,చంద్రకళ, నవీన్, అనూష, అరుణ, వినయ్, నీలి యాదగిరి, వెంకటేష్, పరుశురాం పాల్గొన్నారు.

## మల్దకల్ తిమ్మప్ప స్వామి ఆలయంలో ఏళ్ల తరబడి ఒకే చోట సిబ్బంది: బదిలీలు ఎప్పుడంటే..?

మల్దకల్,(జూన్ 15(విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి (తిమ్మప్ప స్వామి) దేవాలయంలో సిబ్బంది బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ పరిపాలనా అధికారి అయిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈూ)లు నిబంధనల ప్రకారం నిర్ణీత కాలానికి బదిలీ అవుతున్నప్పటికీ, మిగిలిన కార్యాలయ సిబ్బంది మాత్రం ఏళ్ల తరబడి ఒకే స్థానంలో తిష్ట వేయడంపై భక్తులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఉన్నా అమలు శూన్యం**

దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఒకే చోట మూడు నుండి ఐదేళ్లకు మించి పని చేయకూడదు. కానీ, మల్దకల్ ఆలయంలో పని చేస్తున్న పలువురు సిబ్బంది గత ఐదారు ఏళ్లుగా, కొందరైతే అంతకంటే ఎక్కువ కాలంగా ఇక్కడే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కొత్తగా వచ్చే ఈఓలకు స్థానిక లూప్‌హోల్స్ తెలియకపోవడం, పాత సిబ్బందే ఇక్కడ సర్వస్వమై వ్యవహరిస్తుండటంతో ఆలయ పరిపాలనపై భారం పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

**పారదర్శకత లోపిస్తోందనే ఆరోపణలు**

ఒకే చోట సుదీర్ఘ కాలం సిబ్బంది కొనసాగడం వల్ల ఆలయ ఆదాయ వ్యయాల లెక్కలు, ల్యాండ్ రికార్డులు, జాతర నిధుల నిర్వహణలో పారదర్శకత లోపించే అవకాశం ఉందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. కేవలం అధికారులను మాత్రమే మార్చి, కింది స్థాయి సిబ్బందిని అలాగే ఉంచడం వెనుక దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం లేదా రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ఆలయ పవిత్రతను కాపాడటంతో పాటు, పరిపాలనలో పారదర్శకత పెంచేందుకు దేవాదాయ శాఖ కమిషనర్ వెంటనే స్పందించాలని భక్తులు కోరుతున్నారు. మల్దకల్ ఆలయంలో దీర్ఘకాలంగా పాతుకుపోయిన సిబ్బంది అందరినీ తక్షణమే ఇతర ఆలయాలకు బదిలీ చేసి, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిన పోలేపల్లి యువజన సంఘం

**- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కండువాలు కప్పి స్వాగతం**

**- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే చేరికకు కారణమన్న యువకులు**

**- గ్రామ సేవలో చురుగ్గా పనిచేయాలని ఎమ్మెల్యే సూచన**

**- చేరిక కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు**

జడ్చర్ల, జూన్ 15, (విజన్ ఆంధ్ర:) : రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధి పనులు ఆకట్టుకున్నాయి. దీంతో పోలేపల్లి గ్రామానికి చెందిన ఛత్రపతి శివాజీ మహారాజ్ యువజన సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

సంఘం అధ్యక్షుడు ఉరడి జంగయ్య నేతృత్వంలోని బృందం సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిని కలిసింది. కాంగ్రెస్ విధానాలకు మద్దతు ప్రకటిస్తూ పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

నూతనంగా చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్ర స్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

చేరిన యువకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జడ్చర్ల నియోజకవర్గ అభివృద్ధిని చూసి ప్రభావితులమయ్యామని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, గ్రామ సేవకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పోలేపల్లి సర్పంచ్ కందూరి శ్రీశైలం, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి బోయపల్లి లింగం, 7వ వార్డు సభ్యురాలు అనూష శివకుమార్, గణేష్, పండుగ రమేష్, చంద్రకాంత్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## విద్యార్థులకు మొదటి రోజె
# పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ

మల్దకల్, జూన్ 15(విజన్ ఆంధ్ర,), నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మల్దకల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సురేష్ విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా జి. సురేష్ గారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో చదువుతూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను అయిజలో కొనసాగించాలి

**- ఎంపి మల్లు రవి లెటర్ పాడ్ ను జిల్లా కలెక్టర్ కి అందజేత**

అయిజ జూన్ 15 (విజన్ ఆంధ్ర) : ఎర్రవల్లి లో ఉన్నా అయిజ గురుకుల పాఠశాల ను అయిజ కు తరలించాలని ఎంపి. మల్లు రవి జిల్లా కలెక్టర్ కి వ్రాసిన లెటర్ పాడ్ ను సోమవారం ఎమ్మార్పీఎస్ రాజు మాదిగ ప్రజావాణి లో జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి అందజేశారు. అనంతరం ఎస్ సి.కార్పొరేషన్ ఈడి తో, అయిజ శివ సాయి డిగ్రీ కాలేజీ యాజమాన్యం నారాయణ గౌడ్ తో బిల్డింగ్ రెంట్ విషయమై చర్చించడం జరిగింది. త్వరలోనే జిల్లా కలెక్టర్ సమక్షంలో కమిటీ చర్చించి, తగు కార్యాచరణ ముందుకు సాగుతుందని,అన్ని సవ్యంగా సాగితే జులై, ఆగస్టు లో మన గురుకుల పాఠశాల అయిజకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల భద్రత కోసం కట్టుదిట్టంగా పనిచేస్తున్న ఎస్సై. నరేందర్

**- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**
**- ప్రమాదాల నివారణే లక్ష్యంగా తనిఖీలు**
**- హెల్మెట్, డాక్యుమెంట్లపై ప్రజలకు అవగాహన**
**- యన్మన్ గండ్ల గేట్ వద్ద 25 వాహనాలపై కేసులు**



నవాబుపేట, జూన్ 15, (విజన్ ఆంధ్ర) : ప్రజల ప్రాణాలకు రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నవాబుపేట ఎస్సై. నరేందర్ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం యన్మన్ గండ్ల గేట్ వద్ద ఆయన స్వయంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఉక్కుపాదం మోపారు. సరైన ధృవపత్రాలు లేని వాహనాలు, హెల్మెట్ ధరించని వారు, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ ఆటోలపై 25 కేసులు నమోదు చేశారు. తనిఖీల సమయంలో వాహనదారులతో మాట్లాడుతూ నిబంధనల ప్రాముఖ్యతను ఎస్సై.నరేందర్ వివరించారు. హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం ప్రమాదకరమని అవగాహన కల్పించారు. కేసులు నమోదు చేయడం శిక్ష కోసం కాదు, ప్రజలు సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతోనేనని స్పష్టం చేశారు. ప్రజల భద్రత కోసం తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఎస్సై.నరేందర్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.

## గంజాయి సేవిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..

**డి-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు**

కల్వకుర్తి జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కల్వకుర్తి పట్టణంలోని పార్థసారథి థియేటర్ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి తెలిపారు. వెల్దండ మండలం కొట్ర గ్రామానికి చెందిన జగన్ అనే యువకుడు గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి, సత్ప్రవర్తన కోసం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్సై కురుమూర్తి వెల్లడించారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ముద్దాయిని డి-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కురుమూర్తి సూచించారు.

## ఘనంగా సాయిబాబా చౌదరి జన్మదిన వేడుకలు

కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) జూన్ 15 : కెపిహెచ్ బి కాలోని కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మందలపు సాయిబాబా చౌదరి జన్మదిన వేడుకలు సోమవారం నేతలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. కూకట్ పల్లి ఇంచార్జి బండి రమేష్ హాజరై సాయిబాబా చౌదరిని శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# నకిలీ పత్తి విత్తనాల అంతరాష్ట్ర ముఠా గుట్టురట్టు

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి , జూన్ 15, (విజన్ ఆంధ్ర ) : రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ ప్రభుత్వ నిషేధిత పత్తి విత్తనాలు అమ్ముతూ అక్రమంగా అధిక లాభాలు పొందుతున్న ముఠాలను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు ఛేదించి ప్రధాన నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్ సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

వివరాలలోకి వెళితే....

విచారణలో నిందితుడు పాపిన్వార్ సునీల్ కుమార్ 2008 సంవత్సరం నుండి వివిధ సీడ్స్ కంపెనీలలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతులు, ఎరువుల దుకాణదారులతో పరిచయాలు పెంచుకున్నట్లు వెల్లడించాడు. అనంతరం 2018 సంవత్సరంలో హైదరాబాద్ కొత్తపేటలో నితిక్ష అగ్రిటెక్ మరియు జీనియస్ క్రాప్ట్ సైన్సెస్ పేర్లతో కంపెనీలు స్థాపించి సీడ్స్ మరియు బయో-పెస్టిసైడ్స్ వ్యాపారం ప్రారంభించినట్లు తెలిపాడు. సాధారణ వ్యాపారంలో ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో రైతులను మోసం చేసి అక్రమంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో గుజరాత్ రాష్ట్రంలోని ఇదార్‌కు చెందిన గిరీష్ పటేల్ వద్ద నుండి గత నాలుగు సంవత్సరాలుగా నకిలీ పత్తి విత్తనాలు తెప్పించి విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు...

ఇచ్చోడ మండలంలోని ధాబా-బి గ్రామానికి చెందిన ఈశ్వర్, ధాబా-కే గ్రామానికి చెందిన గణేష్ మరియు మహారాష్ట్ర రాష్ట్రం యవత్మాల్ జిల్లాకు చెందిన సందేశ్ బండేవార్‌ల సహకారంతో అమాయక రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది.

ఈ ఏడాది మార్చి నెలలో గిరీష్ పటేల్ వద్ద నుండి పింక్ బాండ్ పేరుతో 500 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు తెప్పించగా, వాటిలో 300 ప్యాకెట్లు ఈశ్వర్‌కు, 158 ప్యాకెట్లు గణేష్‌కు విక్రయించి, మిగిలిన 42 ప్యాకెట్లను మహారాష్ట్రకు చెందిన సందేశ్ బండేవార్ పంపిన వ్యక్తులకు ఆదిలాబాద్ పట్టణంలోని పంజాబ్ చౌక్ వద్ద అందజేసినట్లు నిందితుడు అంగీకరించాడు. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకోవడంతో అతని కంపెనీ వద్ద తనిఖీలు నిర్వహించగా భారీ మొత్తంలో ప్రభుత్వ అనుమతులు లేని బయో-పెస్టిసైడ్స్, ఎక్స్‌పైర్డ్ విత్తనాలు, ప్యాకింగ్ మెటీరియల్, తయారీ ముడిసరుకు, లేబుల్ ప్రింటింగ్ యంత్రాలు, ప్యాకింగ్ యంత్రాలు మరియు ఇతర సామగ్రి దాదాపు 9.5 లక్షల రూపాయల విలువ చేసే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

మొత్తం స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాల విలువ దాదాపు బహిరంగ మార్కెట్లో 9,50,400/- వరకు ఉంటుందని, అదేవిధంగా స్వాధీనం చేసుకున్న ఎక్స్పైర్ విత్తనాలు మరియు మందుల విలువ దాదాపు 9.5 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం స్వాధీనం చేసుకున్న విత్తనాల విలువ రూ 19,00,400/- వరకు ఉంటుందని తెలిపారు.

రైతులను మోసం చేసి అక్రమ లాభాల కోసం నకిలీ విత్తనాల వ్యాపారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా అధికారిక డీలర్ల వద్ద నుండి బిల్లుతో కొనుగోలు చేయాలని, అనుమానాస్పద విత్తనాలు లేదా పురుగుమందుల విక్రయాలపై సమీప పోలీసు స్టేషన్ లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ టు టౌన్ పోలీస్ స్టేషన్లు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు అందులో భాగంగానే ఆదిలాబాద్ పట్టణంలో ఒక గోడౌన్ నందు 750 విత్తన ప్యాకెట్లు లభ్యమైనట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ టు టౌన్ ఇన్స్పెక్టర్ కే నాగరాజు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైలు అఖిల్, గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

(నిందితుల వివరాలు : ఏ1) సందేశ్ బండేవార్, s/o శ్రీ కృష్ణ బండేవార్, వయస్సు 35 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం బిట్టర్‌గావ్ గ్రామం, ఉమార్ఖేడ్ తాలూకా, యవత్మాల్ జిల్లా, మహారాష్ట్ర. (నకిలీ పత్తి విత్తనాల కొనుగోలు మరియు పంపిణీదారుడు) (పరారీ).

ఏ2) పాపిన్వార్ సునీల్ కుమార్ (56) తండ్రి గంగాధర్, యజమాని, నితిక్ష అగ్రి టెక్ & జీనియస్ క్రాఫ్ సైన్సెస్ కొత్తపేట, హైదరాబాద్. (నకిలీ పత్తి విత్తనాల విక్రయాల ప్రధాన నిర్వాహకుడు) (అరెస్టు, రిమాండ్)

ఏ3) రాథోడ్ పండిత్ (32) తండ్రి తుకారాం, యవత్ మాల్, మహారాష్ట్ర. (విత్తనాలు తరలించే వ్యక్తి) ( అరెస్టు రిమాండ్)

ఏ4) రాథోడ్ బాలాజీ (35) తండ్రి రామ్, యవత్ మాల్, మహారాష్ట్ర. (విత్తనాలు తరలించే వ్యక్తి) (అరెస్టు, రిమాండ్)

ఏ5) గిరీష్ పటేల్, యజమాని, సీడ్స్ కంపెనీ, ఇదార్, గుజరాత్ రాష్ట్రం.

(నకిలీ పత్తి విత్తనాల సరఫరాదారు) (ఇచ్చోడా నందు అరెస్ట్)

ఏ6) ఈశ్వర్, నివాసం: ధాబా-బి గ్రామం, ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

(నకిలీ పత్తి విత్తనాల విక్రయదారుడు)(ఇచ్చోడా నందు అరెస్ట్)

ఏ7) గణేష్, నివాసం: ధాబా-కే గ్రామం, ఇచ్చోడ మండలం, ఆదిలాబాద్ జిల్లా.

(నకిలీ పత్తి విత్తనాల విక్రయదారుడు)(పరారీ)

ఏ8) కృష్ణ, యవత్ మాల్,మహారాష్ట్ర. (విత్తనాలు సరఫరా చేసే వ్యక్తి) (పరారీ). ఏ9) కిరణ్, హస్నాపూర్, ఉట్నూరు మండలం. (పరారీ) .)

## భూసారం పెంపునకు రైతులకు వండ్రు మట్టి

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 15 సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మీది కుంటలో రైతులకు మట్టి తోలుకునే కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్న స్వర్ణలతరాజు సోమవారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కుంటలోని నల్లటి వండ్రు మట్టిని వ్యవసాయ భూములకు తరలించడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని, వంటలు బాగా పండుతాయన్నారు. అలాగే రైతులు, ఉపాధి హామీ కూలీలు పనుల వద్ద తగిన జాగ్రత్తలు పాటిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తుల శ్రీనివాస్, వార్డు సభ్యురాలు బత్తుల కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ బత్తుల రేణుక, మేట్ బత్తుల రాణి, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమానికి దోహదపడే ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు స్వాగతించారు.

## రెడ్డిపల్లిలో ప్రైమరీ స్కూల్ ప్రారంభోత్సవం

నర్సాపూర్ 15 జూన్ (విజన్ ఆంధ్ర) నియోజకవర్గ పరిధిలోని నర్సాపూర్ మండల్ రెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభించి,విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయికి దీటుగా, అత్యుత్తమ నాణ్యమైన విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని, చదువుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పలు సంస్కరణలు చేపడుతోందన్నారు. విద్యార్థులందరూ ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, వార్డు సభ్యులు మహేష్ గౌడ్,ఉపాధ్యాయులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

## శిశు మందిర్ పూర్వ ఆచార్యుల సమ్మేళనం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జూన్ 15 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని శిశు మందిర్ లో బల్లు రమేష్ ప్రధానాచార్యగా ఉన్న సేవా కాలంలో పనిచేసిన ఆచార్య బృందం స్థానిక శిశు మందిర్ పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసిన గత మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ వారి వారి కుటుంబ సభ్యులసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ ప్రధానాచార్యులు బల్లు రమేష్ ఆచార్య బృందం రాయిరెడ్డి సంపత్ రెడ్డి,చేకూరి రమేష్,యం.డి ఇర్షాద్,కాశబోయిన ఓదెలు, చేకూరి వీరస్వామి, కాసినగొట్టుశ్రీనివాస్, తిప్పిరెడ్డి అంజిరెడ్డి,గాదర్ల కిరణ్ కుమార్,గట్టు రమాదేవి, గూడ వెంకటలక్ష్మీ, వలబోజు పద్మ,కొత్త హారిక, గడ్డం శ్రీవాణి పూర్వ ప్రబంధ కారిణి సభ్యులు దాసరి సుదర్శన్ ప్రస్తుత ప్రధానాచార్యులు పలారం శ్రీలత పాల్గొన్నారు.

## కేజిబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకై దరఖాస్తులు చేసుకోండి

కాటారం డివిజన్ ప్రతినిధి, జూన్ 15 (విజన్ ఆంధ్ర) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని చల్లా సునీత కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో గల కేజీబీవీలో 6 నుంచి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్రం బోధించుటకు అలాగే ఇంటర్మీడియట్ గణితశాస్త్రం బోధించుటకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 16 నుంచి 18 తారీకు లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ నియామకాలు తాత్కాలిక పద్ధతిలో జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలు ఆయా సబ్జెక్టులో పీజీ , బీఈడీ పూర్తి చేసి టెట్ ఉత్తీర్ణత అయి ఉండాలని పేర్కొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం అందించాలి

చేవెళ్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర): ప్రజల నుంచి అందిన వినతులను సంబంధిత శాఖలు తక్షణమే పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను ఆదేశించారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 3, పెన్షన్లకు సంబంధించిన 9 వినతులు కలిపి మొత్తం 12 దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ సత్వరగతిన పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇప్పటివరకు అందిన దరఖాస్తుల పురోగతిని సమీక్షించి, ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

## కల్లూరులో ఘనంగా ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలు

కల్లూరు, జూన్ 15 (విజన్ అంధ్ర) తెలంగాణా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా పట్టణం లో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు ఎస్కే ఉస్మాన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, ఏ ఏం సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆళ్ళకుంట నరసింహారావు,మున్సిపల్ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చర్ల లో ఘనంగా భట్టి విక్రమార్క 65వ జన్మదిన వేడుకలు

**- చర్ల మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఫోన్ ద్వారా ఎంపీ బలరాం నాయక్ వెల్లడి**

**- ప్రజా సేవలో బట్టిది ప్రత్యేకమైన మార్క్**

**- మండల కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు, వేరువేరు కేక్ కటింగ్ లు**

చర్ల, జూన్ 15 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క 65వ పుట్టినరోజు వేడుకలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు, స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి భద్రాచలం శాసనసభ సభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు పాల్గొన్నారు, ఈ కార్యక్రమం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మోహన్ లత నాయకుడని

ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గా ప్రసాద్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కోసం నిరంతరం శ్రమిస్తున్న గొప్ప నాయకుడు భట్టి విక్రమార్క అని ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రానికి, పార్టీకి మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటున్నాము అని పేర్కొన్నారు,



పిసిసి ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ భట్టి విక్రమార్క నిబద్ధత కలిగిన నాయకులు పార్టీ గెలుపు కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి అభినందనీయం అని , ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందనే నమ్మకం మాకు ఉంది అని ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు,అనంతరం ఇతర నాయకులు భట్టి విక్రమార్క కి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన రాజకీయ ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు,

ఫోన్ ద్వారా ఎంపీ పోరిక బలరాం నాయక్ స్పీచ్

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు చర్ల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అత్యంత ఘనంగా జరిగాయి, ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ ఫోన్ ద్వారా ముఖ్య అతిథిగా పాల్గొని, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా భద్రాచలం -- వాజేడు రహదారి నిర్మాణానికి రూ. 48 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించడం పట్ల స్థానిక నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు,

ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేస్తూ భద్రాచలం ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ఎంపీ భరోసా ఇచ్చారు,

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళికృష్ణ, లంక రాజు, గుండెపూడి భాస్కర్ రావు, తాండవరాయుడు తదితర సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క ప్రజల మనిషి

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జన్మదిన వేడుకలను చర్ల మండలంలో మరో వర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ మాట్లాడుతూ సాధారణ కుటుంబం నుంచి వచ్చి నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజాసేవలో నిమగ్నమైన అరుదైన నాయకుడు భట్టి విక్రమార్క అని కొనియాడారు, పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న ప్రజా నాయకుడని, ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సేవలో భట్టి విక్రమార్క కి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నా మహోన్నత వ్యక్తి అని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా వారు చేస్తున్న సేవలు ప్రజలు ఎన్నటికి మర్చిపోరని ,బట్టి అంటే అది ఒక బ్రాండ్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఉప సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, సుందరి సురేష్, ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జవ్వాది రవికుమార్, చీమకుర్తి వీరభద్రం, మండల మాజీ అధ్యక్షులు ఆవుల విజయభాస్కర్ రెడ్డి , పటేల్ వెంకటేశ్వర్లు , అలవాల బాలు , పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దాహంతో నిజాంపేట్... నిద్రలో వాటర్‌బోర్డు!

- నిజాంపేట్‌కు నీళ్లు కరువు... అధికారులకు పట్టదా?
- రోజురోజుకూ ముదురుతున్న తాగునీటి సంక్షోభం
- ఐదు లక్షల జనాభాకు వారానికి ఒక్కసారే తాగునీటి సరఫరా
- నీరు లేకున్నా బిల్లుల వసూళ్లు.. ట్యాంకర్ల వ్యాపారంపై అనుమానాలు
- 14 ఎంజీడీ కేటాయింపు, కోటి లీటర్ల అదనపు నీరు కోరిన జేపీసీ

ప్రగతి నగర్, జూన్ 15 (విజన్ ఆంధ్ర) నిజాంపేట్ సర్కిల్ పరిధిలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతుండటంతో లక్షలాది మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా పెరగకపోవడంతో అనేక కాలనీల్లో నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో నిజాంపేట్ సర్కిల్ జేపీసీ ప్రతినిధులు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డిప్యూటీ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, మేనేజింగ్ డైరెక్టర్లకు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జేపీసీ ప్రతినిధుల వివరాల ప్రకారం నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రస్తుతం సుమారు ఐదు లక్షల జనాభా నివసిస్తోంది. ప్రగతి నగర్, బాచుపల్లి, నిజాంపేట్ తదితర ప్రాంతాల్లో పంపింగ్ స్టేషన్లు ఉన్నప్పటికీ అవసరమైన స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదని పేర్కొన్నారు. దీంతో అనేక కాలనీల్లో వారానికి ఒక్కసారి మాత్రమే తాగునీరు అందుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ప్రతి వ్యక్తికి రోజుకు 130 లీటర్ల తాగునీరు అందాల్సి ఉన్నప్పటికీ వాస్తవ పరిస్థితుల్లో కనీస అవసరాలు కూడా తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న సమయంలోనే ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాలు పెరగడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పైప్‌లైన్ లీకేజీలు, పాత మోటార్లు, సిబ్బంది కొరత, నిర్వహణ లోపాలు నీటి సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని జేపీసీ ఆరోపించింది. లక్షల రూపాయలు చెల్లించి నీటి కనెక్షన్లు పొందిన వినియోగదారులకు సరైన సరఫరా అందకపోయినా కనీస బిల్లుల వసూళ్లు కొనసాగించడం అన్యాయమని మండిపడింది.

ప్రగతి నగర్ ప్రాంతానికి రోజుకు కనీసం ఒక కోటి లీటర్ల అదనపు తాగునీటిని సరఫరా చేయాలని, నిజాంపేట్ సర్కిల్‌కు కనీసం 14 ఎంజీడీ నీటి కేటాయింపునకు అవసరమైన ట్రాన్స్‌మిషన్ అలోకేషన్ ఆర్డర్ (టీఏఓ) మంజూరు చేయాలని జేపీసీ డిమాండ్ చేసింది. అలాగే ట్యాంకర్ల ద్వారా జరుగుతున్న నీటి విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి, పైప్‌లైన్ లీకేజీలు, పంపింగ్ వ్యవస్థలోని లోపాలను తక్షణమే సరిచేయాలని కోరింది. తాగునీటి సమస్యను అత్యవసర అంశంగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకోవాలని జేపీసీ ప్రతినిధులు హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

బందారం రేగటమ్మ జాతరలో

# భక్తుల కోసం చలివేంద్రం

- గంప మల్లేశం గుప్త జ్ఞాపకార్థం ఏర్పాటు

దౌల్తాబాద్, జూన్ 15 (విజన్ ఆంధ్ర): మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రేగటమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా భక్తుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ గణేష్ ఆగ్రో కెమికల్స్ యజమాని గంప రవి గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక చలివేంద్రం ఏర్పాటు చేశారు. తమ తండ్రి గంప మల్లేశం గుప్త జ్ఞాపకార్థంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సదుపాయం కల్పించడం తమ బాధ్యతగా భావించి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ప్రతి సంవత్సరం బందారం రేగటమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని గంప రవి గుప్త వెల్లడించారు. సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జాతరకు విచ్చేసిన భక్తులు చలివేంద్రం ద్వారా అందుతున్న తాగునీటి సదుపాయాన్ని వినియోగించుకుంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# సి.డి.ఎ సంస్థ ద్వారా 2.40 లక్షలతో మూడు ఉచిత చేతి పంపుల ఏర్పాటు

-సిడిఎ కార్యదర్శి, ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు రెవ ఎనోష్ కుమార్

కల్లూరు, జూన్ 15(విజన్ ఆంధ్ర) : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ సంస్థ మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మండలంలోని లింగాల, పోచారం గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని కప్పలబంధం గ్రామంలో మొత్తం రూ.2.40 లక్షల వ్యయంతో మూడు ఉచిత మంచినీటి చేతి పంపులను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ చేతి పంపులను సీడీఏ కార్యదర్శి, అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రెవ. ఎనోష్ కుమార్ ఏర్పాటు చేయగా కప్పలబంధం గ్రామంలో, పోచారం ఎస్సీ కాలనీలో గ్రామ సర్పంచ్ కట్టా ధనమ్మ, మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, లింగాల గ్రామ సర్పంచ్ వేము కృష్ణతో కలిసి సిడిఏ కార్యదర్శి ఏనోష్ కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రెవ ఎనోష్ కుమార్ మాట్లాడుతూ ఆయా గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజల కష్టాలను తెలుసుకున్న వెంటనే స్పందించి సీడీఏ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా చేతి పంపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ప్రజల దాహార్తిని తీర్చడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనానికి స్వచ్ఛమైన నీరు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజ సేవే పరమావధిగా సీడీఏ సంస్థ నిరంతరం పేదలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, తాగునీటి రంగాల్లో సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయని చెప్పారు. గ్రామాల్లో ఉచిత మంచినీటి పంపులు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరించిన సీడీఏ సంస్థకు, రెవ ఎనోష్ కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, మహిళలు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దాహార్తిని తీర్చండి.. నీటి సమస్యపై వెంటనే చర్యలు తీసుకోండి

అధికారులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాలు

రామకృష్ణ నగర్, బాల్‌రెడ్డి నగర్‌లో ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పర్యటన

మురుగునీరు కలవడంతో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

లో ప్రెజర్ కారణంగా చివరి ఇంటి వరకు చేరని నీటి సరఫరా

పెండింగ్ సీసీ రోడ్లు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ

కుత్బుల్లాపూర్, జూన్ 15 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ప్రస్తుతం నెలకొన్న నీటి కొరతను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం 131వ డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్, బాల్‌రెడ్డి నగర్ కాలనీల్లో ఆయన అధికారులతో కలిసి పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ నగర్ వాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. తాగునీటిలో మురుగునీరు కలవడం వల్ల నీటిని వినియోగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సరఫరా కూడా తక్కువ ఒత్తిడితో జరుగుతుండటంతో అవసరమైన మేర నీరు అందడం లేదని వాపోయారు. దీంతో తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నామని తెలిపారు. అదేవిధంగా బాల్‌రెడ్డి నగర్ కాలనీవాసులు కూడా లో ప్రెజర్ కారణంగా తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని, పార్కు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ వెంటనే సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో తాగునీటి కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా జరగడం వల్ల కాలనీల్లోని చివరి ఇంటి వరకు నీరు చేరడం లేదని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ భద్రు, వాటర్ వర్క్స్ డీజీఎం ప్రసాద్‌రావు, ఏఈ గోపాలకృష్ణ, ఎలక్ట్రికల్ అధికారి రవీందర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్, మాజీ కౌన్సిలర్లు కిషన్‌రావు, సూర్యప్రభ, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# బాయిబాటతో సింగరేణిలో టీఆర్ఎస్ పోరాటానికి శ్రీకారం

కాసిపేట మైన్-1లో కవిత గేట్ మీటింగ్..

సింగరేణి కార్మికుల సమస్యలపై ప్రభుత్వంపై విమర్శలు

బెల్లంపల్లి జూన్ 15 విజన్ ఆంధ్ర : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చేపట్టిన సింగరేణి బాయిబాట కార్యక్రమానికి కాసిపేట మైన్-1 నుంచి శ్రీకారం చుట్టారు. టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మైన్‌ను పరిశీలించి కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆమె మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాపాడడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

పాలసీలు రూపొందించి సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్మికులకే వినతిపత్రాలు ఇస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డిపెండెంట్ ఉద్యోగాల నుంచి మెడికల్ బోర్డుల నిర్వహణ వరకు ప్రతి అంశంలో కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు.

సింగరేణి కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందడం లేదని, ఉన్న ఆస్పత్రుల్లో కూడా వైద్యుల కొరత ఉందని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో ప్రైవేటీకరణ ద్వారా వైద్యాన్ని మరింత ఖరీదుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు.

కాసిపేట మైన్‌లో ఒక్కో షిఫ్ట్‌కు సుమారు 300 మంది కార్మికులు విధులకు వెళ్లాల్సి ఉండగా, మ్యాన్‌రైడింగ్ యంత్రంలో కేవలం 70 సీట్లు మాత్రమే ఉండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కవిత అన్నారు. ఉదయం 8.30 గంటలలోపు గనిలోకి దిగితేనే మస్టర్ వేస్తారని, ఆలస్యమైతే వేయరని, అదే యంత్రాన్ని యాజమాన్యం అవసరాలకు మాత్రం ఎప్పుడైనా వినియోగిస్తున్నారని పేర్కొంటూ కార్మికుల పట్ల ఈ వివక్ష ఎందుకని ప్రశ్నించారు. హెచ్ఎంఎస్‌తో కలిసి టీఆర్ఎస్ కార్మికుల హక్కుల కోసం సంయుక్తంగా ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.

వారం రోజుల పాటు కొనసాగే 'బాయిబాట' కార్యక్రమాన్ని కాసిపేట నుంచే ప్రారంభించామని, తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా ఎదుగుతున్న టీఆర్ఎస్‌కు సింగరేణి కార్మికుల ఆశీర్వాదం కావాలని కవిత కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, టి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు సిద్ధంశెట్టి సాజన్, రాష్ట్ర జిల్లా నాయకులు మౌనిక్, సింగరేణి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.